గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# అక్టోబర్ 2016
# కథలు




“అమ్మా! రేపటి నుండి స్కూలుకి దసరా సెలవులు. చుట్టాలింటికి, టూర్లకి వెళుతున్నారు స్నేహితులు. మనం కూడా ఎక్కడికైనా వెళ్దామా?” అని అడిగాడు గోపి టిఫిన్ తింటూ.

“ఎక్కడికి వెళ్ళాలన్నా చాలా డబ్బు ఉండాలి. మీ నాన్నగారికి సెలవు దొరుకుతుందో లేదో” అంది మానస.

“అవన్నీ నాకు తెలియదు. సెలవులు తరువాత బడికి వచ్చి ఏమేం చూసారో గొప్పగా చెబుతారు అందరూ. నేనొక్కడినే ఏమీ చెప్పలేను. షేం షేం అంటారు” మొహం చిన్నది చేసుకొని చెప్పాడు గోపి.

మోహన్, మానసల ఏకైక పుత్రుడు గోపి. మంచి అలవాట్లతో పెంచుతున్నారు కొడుకుని. అయినా తోటి విద్యార్థుల ప్రభావం అప్పుడప్పుడు గోపి మీద పడుతుంది. అందుకే తల్లితో మనసులో కోరిక చెప్పాడు గోపి.

మానసకు ఇంట్లో ఆర్ధికపరిస్థితి తెలియంది కాదు. మామగారి ఆపరేషన్ కోసం ముందు నెలలోనే ఆఫీసు నుండి అప్పు తీసుకున్నారు. ఆడపడుచు చదువుకి అవసరమై స్నేహితుడి దగ్గర బదులు తీసుకున్నాడు మోహన్. ఇంటి అద్దె, ఇతర ఖర్చులు ఎక్కువవై పొదుపు కూడా తగ్గింది. గోపి కోరిక చెబితే భర్త ఏమంటాడో అని గుబులుగా ఉంది మానసకి.

మానస ఆలోచనల్లో ఉండగానే “అమ్మా నా స్కూలుకి టైమయింది. సాయంత్రం వచ్చేసరికి గుడ్ న్యూస్ చెప్పాలి” అని తల్లి బుగ్గ మీద ముద్దు ఇచ్చి వెళ్ళాడు గోపి.

బాత్రూములో ఉన్న మోహన్ తల్లీకొడుకుల మాటలు విన్నాడు. బయటకు రాగానే “గోపి చిన్నపిల్లవాడు. సరదాలు సహజం. వాడికి నెమ్మదిగా నచ్చజెప్పు. విహారయాత్రలకి వెళ్లాలని నాకూ ఉంది. డబ్బూ, సెలవూ రెండూ లేవు. నీకు తెలియని ఆదాయం మనకు ఏమీ లేదు” అన్నాడు మోహన్.

నిజమేనన్నట్టు తలాడించింది మానస.

మోహన్ ఆఫీసుకి వెళ్ళాక దగ్గరలోని గుడికి వెళ్లి “దేవుడా! మా అబ్బాయి మనసు కష్టపెట్టకుండా పరిష్కారం చూపించు” అని వేడుకుంది.

సాయంత్రం గోపి వచ్చేసరికి ఏమి జవాబు చెప్పాలా అని లోలోపల గుబులు పడుతోంది మానస.

“మమ్మీ...” అన్న పిలుపు వినబడడం, గోపి ఇంట్లో అడుగు పెట్టడం ఒకేసారి జరిగింది. షూ విప్పేసి, చేతులు కడుక్కొని లోపలకు వచ్చాడు గోపి.

“ఇదిగో ఈ ఏపిల్ తింటూ ఉండు. పాలు ఇస్తాను” అని ఏపిల్ అందించింది మానస.

ఏపిల్ అందుకొని కొరికి “ఈ రోజు స్కూల్లో ఏమి జరిగిందో తెలుసా? మత సామరస్యం మీద పాఠం చెప్పారు మాష్టారు. వెంటనే

నా స్నేహితులు కరీం, యోహాన్ గుర్తొచ్చారు. యోహాన్ పుట్టినప్పుడే అమ్మ చనిపోయిందట. కొత్త అమ్మ రోజూ కొడుతుందట! నాన్న లేడు కాబట్టి కరీం కూడా బడి వదిలాక సైకిలు షాపులో పనిచేస్తాడు. దసరా పండుగ ఎలా జరుపుతామో వాళ్లకి తెలియదని ఒకసారి చెప్పారు. అందుకే మన ఇంటికి పిలిచాను. పండుగ రోజులలో మా ముగ్గురికీ భోజనం, పిండివంటలు సమానంగా వడ్డించు. సెలవుల్లో మనం ఎక్కడికీ వెళ్లొద్దు. వాళ్ళని మాత్రం రావద్దని చెప్పకు. ప్లీజ్ మమ్మీ" అన్నాడు గోపి.

ఆ మాటలు విని మానస ఆశ్చర్యపోయింది. సమస్య తీర్చిన దేవుడికి కృతజ్ఞతలు చెప్పాలో లేక కొడుకు విశాల హృదయానికి ముందుగా అభినందనలు తెలపాలో తెలియక ఉబ్బితబ్బిబ్బయింది మానస.




తెల్లవారుఝాము ఐదు గంటలు.

శివాలయంలో-

హరశ్చ బహురూపశ్చ, త్ర్యంబకశ్చాపరాజితః

వృషాకపిశ్చ శంభుశ్చ, కపర్దీ రైవతస్తథా

మృగవ్యాధశ్చ శర్వశ్చ, కపాలీ చ విశాంపతే

ఏకాదశైతే కథితా, రుద్రాస్త్రిభువనేశ్వరాః

ఏకనాథుడు కంచు కంఠంతో దేవాలయం ప్రతిధ్వనించేలా పాడుతున్నాడు. వింటున్న భక్తుల మనసులు పులకించిపోతున్నాయి.

ఏకనాథుడు ఆ శివాలయంలో తండ్రి తర్వాత వారసత్వంగా పూజారయ్యాడు. కేవలం వంశపారంపర్యంగానే కాదు, శివుడంటే అతనికి భక్తి, వల్లమాలిన అభిమానం. పూజలో లోటు జరగడం మాట అటుంచి కనీసం ఆ ఆలోచన వచ్చినా తలడిల్లిపోతాడు. అహర్నిశలూ శివుడి చెంతే ఉండాలనుకుంటాడు. ఉంటాడు.

అదే సమయానికి అతనింట్లో-

య ఏకోవర్ణో బహుధా శక్తియోగాద్

వర్ణనేకాన్నిహితార్థో దధాతి

విచైతి చాంతే విశ్వమాదౌ చ దేవ

స నో బుద్ధ్యా శుభయా సంయునక్తు.

శైలు శృతిసుద్ధంగా పాడుతూ పార్వతీ దేవిని షోడశోపచారాలతో, రకరకాల పూలతో పూజిస్తోంది. ఇంట్లోని అత్తమామలు ఆమె నిత్యం చేసే పూజకి భక్తిపారవశ్యంలో మునిగితేలుతుంటారు. శైలు రెండేళ్ల క్రితం ఏకనాథుడి భార్యగా ఆ ఇంట్లోకి అడుగుపెట్టింది. భర్తకు తగ్గ భార్య.

పూజలో సంపూర్ణంగా లీనమైనా, ఆమె మనసును ఒక ఆలోచన దొలుస్తోంది. తన పెళ్లై రెండేళ్లవుతోంది. ఎక్కడికి, ఏ శుభకార్యానికెళ్లినా అందరూ అడిగే మాట 'ఏమన్నా విశేషమా?' అని, ఇంట్లో పెద్దవాళ్లు కూడా 'నీ కడుపున ఓ కాయ కాస్తే చూడాలనుందమ్మా' అనడమే. తనకూ తల్లి కావాలనే కోరిక ఉంది. కానీ తన భర్తకు సమస్తం శివుడే. పెళ్లయినప్పటి నుంచి ఓ అచ్చటా లేదు ముచ్చటా లేదు. పడక గదిలో కూడా శివుడు..భవుడు..శంకరుడి గురించిన ఆలోచనలే..నిద్రలోనూ అవే కలవరింతలు! ఇహ ఆ 'కార్యం' జరిగేదెలా? తన కడుపున ఓ నలుసు పుట్టేదెలా?

ఆలోచనల్నుంచి బయటపడి శివపార్వతులకు నైవేద్యం పెట్టి, హారతిచ్చింది.

*****

కైలాసంలో-

"..ఏవండీ"

"ఊ.."

"మిమ్మల్నే..ఎప్పుడూ ధ్యానమేనా? కాస్త నా మాట కూడా వినిపించుకోండి"

"చెప్పు పార్వతీ"మూసుకున్న కళ్లను అర్ధనిమీలితం చేసి మంద్రంగా అన్నాడు.

"చూశారా? ఆ భక్తురాలి వేదన. మీరు ఏకనాథుణ్ని కాస్త వదిలితే..అతను భార్యతో కలిసి..ఆమె కడుపు పండిస్తాడు"

"నేను వదలడమేంటి? అతనే నన్ను వదలడం లేదు. భక్తితో కట్టి పడేశాడు"

"మీ మాటల గారడి ఆపి వాళ్లను కలిపే ఉపాయం చేయండీ. ఎప్పుడూ భూలోకం మీద పాపభారం ఎక్కువైతే విష్ణుమూర్తే అవతారాలు ఎత్తుతాడు. భూలోకంలో స్త్రీలను మానసికంగా, శారీరకంగా హింసించేవాళ్లు ఎక్కువైపోయారు. లైంగిక వేధింపులు, నిర్భయా కేసులు ఎన్ని చట్టాలు చేసినా తామరతంపరగా పెరిగిపోతున్నాయి. ఇప్పుడు నేను అవతారం ఎత్తవలసిన అవసరం ఏర్పడింది. మదాందుల మదమణుస్తాను. స్త్రీ స్వాతంత్ర్యమర్హతి అని చాటి చెబుతాను. లోకానికి చూపుతాను. నా జననానికి శైలు గర్భమే సరైనదని ఎంచుకున్నాను. మీరు మన్మధుణ్ని పిలిచి, అతనితో ప్రియ సంభాషణలు గావించి అతని చెరకు వింటితో, విరుల బాణాలు ఏకనాథుడి మీద ప్రయోగింపచేస్తే..ఓ సృష్టి కార్యం జరుగుతుంది. ఏమంటారు?"అంది.

"ఇక్కడైనా(కైలాసం)..అక్కడైనా(భూలోకం)..ఎక్కడైనా(ఏ లోకమైనా) భార్య కరణేషు మంత్రి. చక్కటి మాట చెప్పావు" అని మన్మధుణ్ని మనసులో తలుచుకున్నాడు.

మన్మధుడు ప్రత్యక్షం అవగానే..కాసేపు సరదాగా మాట్లాడి.. అతని చెవిలో ఏదో చెప్పాడు.

మన్మధుడు తన చెరుకు వింటి నారిని సవరించుకుంటూ, నవ్వుతూ వెళ్లిపోయాడు.

అతను వెళ్లిపోయినా ఆప్రాంతం శోభాయమానంగా..సుగంధభరితంగా మారి..శివపార్వతుల మనసుల్లో ఏదో మధుర భావనలు రేకెత్తించింది. శివుడు పార్వతివంక చూశాడు. ఆమె సిగ్గుల మొగ్గ అయింది. కైలాసం సృష్టి కార్యానికి మరోసారి వేదికయ్యింది.

****

రాత్రి పదిగంటలు. శివాలయం తలుపులు మూసి ఇంటికి బయల్దేరాడు ఏకనాథుడు. చల్లగాలితో కూడిన వర్షపు జల్లుపడుతోంది. ఇంటికెళ్లే దారిలో పెద్ద పూలతోట ఉంది. గాలి అలలపై పూల సువాసనలు తేలివస్తూ అతని ఘ్రాణేంద్రియముద్వారా మనసులోకి ప్రవహించి ఏవేవో మధురోహలకు ప్రాణం పోస్తోంది. 'ఎప్పుడూ లేంది ఇదేమిటా?' అని ఓ పక్క ఆశ్చర్యం కలుగుతున్నా..మరోపక్క తెలియని వివశత్వం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

ఇంటికొచ్చిన ఏకనాథుడు బావి దగ్గరికెళ్లి శుభ్రంగా స్నానం చేశాడు. భర్తకు తుండుగుడ్డ తెచ్చిచ్చింది శైలు. వెన్నెల వెలుగులో భార్య అందం అతనిలోని మగాణ్ని సవాలు చేస్తోంది. శుభ్రంగా ఒళ్లు తుడుచుకుని పొడి బట్టలు కట్టుకుని ఇంట్లోకి నడిచాడు. అప్పటికే పెద్దవాళ్లు తిని నిద్రపోయారు.

భర్తకు కంచం పెట్టి తను చేసిన పదార్థాలను కొసరి కొసరి వడ్డించి తినిపించింది. అమృతంలా ఉన్న పదార్థాలను కడుపునిండా తిని తమ గదిలోకి వెళ్లాడు.

తనూ ఇంత తిని వంటిల్లు సర్ది తమ గదిలోకి అడుగెట్టింది. అంతే..

తలుపు చాటుగా నుంచున్న ఏకనాథుడు ఆమెని ఉద్రేకంతో..ఆవేశంతో..సునామీలా చుట్టేశాడు. అదేమాత్రం ఊహించని శైలు మొదట కంగారు పడినా..తర్వాత భర్తలో వచ్చిన మార్పు వల్ల హృదయోల్లాసాన్నందింది. ఆమెలోని స్త్రీత్వం పురులు విప్పుకుంటోంది. అతనిలోని కాముడు విజృంభిస్తున్నాడు. ఆ రాత్రి వాళ్ళు అనుభూతుల వర్షంలో తడిసి ముద్దయ్యారు. సృష్టికార్యాన్ని సఫలం చేశారు. ఆది దంపతులైనా..ఆ దంపతులైనా సృష్టి మనుగడకు కార్యసాధకులవవలసినదే!

*****

ఆ దంపతులకు సరిగ్గా విజయదశమినాడు పాప పుట్టింది. పేరు విజయ దుర్గ. ఆ ఇంట్లో వాళ్ళకే కాదు ఊరు ఊరందరికీ ఆమె అంటే ప్రాణం. సాక్షాత్తు కనకదుర్గ.

ఆ ఊళ్లోనే కాదు చుట్టుపక్కల పది ఊళ్ల వరకు ఏ మగాడైనా ఆడపిల్ల జోలికి వచ్చాడంటే..ఎక్కడ్నుంచి వస్తుందో..ఎలా వస్తుందో తెలియదు కాని కళ్లలో నిప్పులు కురిపిస్తూ, సింహవాహినియై కదిలివచ్చి తాట ఒలుస్తోంది. మదకీచకుల కుత్తుకలు తెగనరుకుతోంది. ఫేస్ బుక్, వాట్సప్, పేపర్లలో, ఛానల్ టీ వీల్లో వార్త హల్ చల్ చేస్తోంది.

మహిళల్ని రక్షించాలని ప్రభుత్వాలు ఎన్నిప్రయత్నాలు చేసినా, చట్టాలుచేసినా అనుకున్న ఫలితాన్నివ్వకపోయినా, ఇప్పుడు మాత్రం మగాళ్లు తలొంచుకుని "స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం" అంటున్నారు. ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో..అక్కడ దేవతలుంటారు..అన్న మాటను నిజం చేస్తూ..కైలాసంలోని పార్వతి భూలోకంలోని మార్పుకి మానసికోల్లాసినియై మనస్ఫూర్తిగా దసరా పూజలందుకోవడానికి తరలివస్తోంది. సిద్ధంగా ఉండండి.

సర్వేశాం స్వస్థిర్ భవతు

సర్వేశాం శాంతిర్ భవతు

సర్వేశాం పూర్ణం భవతు

సర్వేశాం మంగళం భవతు




www.gotelugu.com www.gotelugu.com www.gotelugu.com www.gotelugu.com www.gotelugu.com www.

చికినాల లో ఓబులేశు అనే చిన్నపాటి రైతు ఉండేవాడు. తనకున్న కొద్ది పాటి పొలాన్ని కష్ట పడి సాగు చేసుకునే వాడు. కానీ అతనికో దురలవాటు ఉండేది. తూనీగలకి దారం కట్టి, మిణుగురులను సీసాలో పట్టి, పక్షులను వడిశెలతో కొట్టి వినోదించేవాడు.

ఓబు లేశుకి చేపల కూరంటే ఎంతిష్టమో! రోజూ తన పంట పొలాల అవతల ఉన్న ఏట్లో గాలం వేసి కొన్ని చేపలను పట్టి భార్యతో వండించుకుని తింటే గానీ అతడికి ముద్ద దిగేది కాదు.

ఒక సారి కాని కాలంలో తుఫాను వచ్చింది. విపరీతంగా వర్షాలు పడ్డాయి. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. పొట్ట దశలో ఉన్న పంట పొలాల్లో ఏటి నీరు చేరింది. వరి మొక్కలన్నీ తలలు వాల్చేశాయి. అనుకోని నష్టానికి రైతులందరూ తల్లడిల్ల సాగారు. ఓబులేశు కూడా దుఃఖిస్తూ తన పొలానికి వెళ్ళాడు. ఏట్లో నీరు తన పొలంలో చేరింది. ఆ నీటితో పాటుగా కొన్ని చేపలు కూడా తన పొలంలో చేరడం గమనించాడు.

' సరే! జరిగిన నష్టం ఎలాగూ పూడ్చలేం..కొన్ని చేపలన్నా పట్టుకుందాం.ఈ చలిలో వేడి వేడి చేపల కూర

తినొచ్చు.'అనుకున్నాడు.

గాలం వేశాడు.అంతే! మిలమిల మెరుస్తున్న బంగారు రంగు చేప ఒకటి అతని గాలానికి చిక్కింది. దాని కళ్ళు వజ్రాల్లా మెరుస్తున్నాయి. ఓబులేశు దానిని నీటి బొక్కెన లో జారవిడిస్తే అది చిన్న చిన్న గా తృళ్ళి పడ సాగింది. అటువంటి అపురూపమైన, అరుదైన అందాల చేపను బహుశా అంత వరకు ఎవరూ చూసి ఉండరు.

నోరు వెళ్ళ బెట్టి కాసేపు చేపని చూసిన ఓబులేశు మనసులో ఆశ మెరిసింది. 'దీనిని రాజు గారికి ఇస్తే నాకు కానుకగా డబ్బే డబ్బు.' అనుకున్నాడు సంబరంగా.

ఇంతలో తళుకులినుతున్న ఆ చేప తమాషాగా కళ్ళు ఆర్పుతూ " ఓ మనిషీ! దయ చేసి నన్ను ఆ ఏట్లో వదిలేస్తే మిగిలిన నా నాలుగు నేస్తాలతో వెళ్ళి పోతాను." అంది.

కాంతులు చిమ్మే ఆ చేప మాట్లాడినందుకు ఓబులేశు మరింత ఆశ్చర్య పోయాడు. అతనిలో అత్యాశ పడగలు విప్పింది.

"ఓ బంగారు చేపా! నిన్ను ఏటి గట్టుకు తీసుకుపోతా. మిగిలిన నీ నాలుగు నేస్తాలను కూడా పిలువు" అన్నాడు.

"ఎందుకు?" అందా చేప అనుమానిస్తూ.

"అయిదు అందాల మాట్లాడే బంగారు చేపల్ని రాజు గారికిస్తే నాకు బహుమతిగా బోలెడు డబ్బిస్తారు. రాజుగారు మిమ్మల్ని చంపరులే. గాజు తొట్టెలో ఉంచి పెంచుకుంటారు. గొప్పగా అందరికీ చూపిస్తారు." అన్నాడు ఓబులేశు.

దానికా చేప "సాటి ప్రాణుల స్వేచ్ఛను హరించే హక్కు మనకి లేదు. అర్థం చేసుకో." అని దీనంగా బతిమాలింది.

"ఆ నాలుగిటినీ అప్పగిస్తే నిన్నొదిలేస్తా" అని ఆశ పెట్టాడు ఓబులేశు. అయిన అది ససేమిరా ఒప్పుకో లేదు.

ఓబులేశు బెదిరింపు లోకి దిగాడు. "మర్యాదగా పిలిస్తే గాజు తొట్టెలో అయినా బతికుంటావు. లేదంటే నిన్ను చంపేస్తా" అని హెచ్చరించాడు.

"చావడానికైనా సిద్ధమే గానీ సాటి ప్రాణులకు అందునా స్నేహితులకు హాని తల పెట్టను." అందా చేప మొండిగా. భయ పెట్టే ఉద్దేశ్యంతో చేప మెడ నొక్క సాగాడు. ప్రాణ భయంతో గిజ గిజ లాడిందా చేప. వదలమంటూ వేడుకుంది. కాసేపటికి వణికి పోతూ "సరే! ఒప్పుకుంటున్నాను. నా నేస్తాలను అప్పగిస్తా. నన్నొదిలెయ్." అని అరిచింది.

ఇంతలో ఒక విచిత్రం జరిగింది. నక్షత్రాల్లాంటి కళ్ళతో, బంగారం లాంటి ఒళ్ళుతో అద్భుతంగా మెరిసి పోతున్న ఆ చేప ఒక్క సారిగా మామూలు చేపగా మారి పోయింది. మాట్లాడే శక్తి కూడా కోల్పోయింది.

ఓబులేశు తెల్ల మొహం వేశాడు. కాసేపు ఆలోచించిన మీదట అతనికి ఒక విషయం తేట తెల్లమైంది.

"ప్రాణ భయంతో తప్పని సరి అయినా సరే. సాటి ప్రాణికి కీడు తల పెట్టాలనే నిర్ణయానికి రాగానే చేపకి ఆ గతి పట్టింది. మరి సరదాకి రోజూ తూనీగలని ఏడిపించే తన గతి ఏమిటి?" ఈ ఆలోచనతో అతను సిగ్గు పడి భద్రంగా ఆ చేపను ఏట్లో వదిలాడు.

ఆనాటి నుండి జీవ హింస చేయకుండా ప్రశాంతంగా జీవించ సాగాడు.


విడాకులు
శైలజామిత్ర


బొమ్మ చెప్పిన కథ
బంధం
చెన్నూరి సుదర్శన్
www.gotelugu.com




"ఊరెళ్ళి సిద్ధాంతి గార్ని కలిసొద్దామనుకుంటున్నాం.. మీరు కూడా ఏమైనా వస్తారా?" అన్నయ్య ఫోన్ చేసి అడిగేసరికి వెంటనే "సరే" అనేసాడు కామేశ్వరరావు. ....నిజానికి దసరా సెలవులు ఇచ్చిన దగ్గర్నుంచి ఏదో ఒకరోజు ఊరు వెళ్దామని అనుకుంటున్నాడు భార్య, పిల్లలతో. ఇప్పుడు వాళ్ళ అన్నయ్య, వదిన కూడా వస్తామనడంతో మరుసటి రోజు ప్రయాణం ఖాయం చేసేసుకొన్నారు. కాకినాడ నుంచి అమలాపురం బస్సెక్కి కూర్చున్నాక అన్నదమ్ములు, తోడికోడళ్ళు కబుర్లలో మునిగిపోయారు. కామేశ్వరరావు కొడుకు స్మార్ట్ ఫోన్లో గేమ్స్ ఆడడంలో మునిగిపోయాడు.

కామేశ్వరరావు వాళ్ళది అమలాపురం దగ్గర చిన్న పల్లెటూరు. ఇప్పుడిప్పుడే పట్నం రూపం సంతరించుకొంటోంది. తల్లి దండ్రులు ఐదారేళ్ళ క్రితమే అనుకోకుండా వెంటవెంటనే కాలం చేయడంతో ఊళ్ళోకి వెళ్ళాలంటే కామేశ్వర్రావుకి బెంగ. నిజానికి ఊళ్ళో అమ్మ, నాన్నల దగ్గర ఉందామనే ఉద్దేశ్యంతోనే, పెద్ద ప్రయత్నంమీద హైదరాబాద్ నుంచి స్వంత జిల్లాకి ట్రాన్స్ఫర్ చేయించుకున్నాడు. ఇవ్వాళో రేపో సొంతూరికే మకాం మారుద్దామనుకొనేంతలో తల్లిదండ్రులు పోవడంతో, ఆ ఇంట్లో ఉండడం బెంగగా అనిపించి ఉద్యోగం చేస్తున్న కాకినాడలోనే అయిష్టంగానైనా అద్దె ఇంట్లో మకాం పెట్టాడు. అప్పటికే అన్నయ్య కూడా అక్కడే స్థిరపడడంతో ఊరికేసి ట్రాన్స్ఫర్ గురించి పెద్దగా ఆలోచన రాలేదు. ఊరికి వెళ్లాలనో, వీలయితే, అక్కడే ఉండిపోవాలనో కోరిక తరచూ మనసులో రొద పెడుతున్నా పిల్లల చదువుల వంకతోనో, పట్నం సౌకర్యాల పేరుతోనో వాయిదా పడుతూ వస్తోంది. అయినా దసరా సెలవులకి ఊరు వెళ్లకపోతే ఏదో వెలితి. ఎందుకంటే, గణపతి, దసరా నవరాత్రులు తమ ఊర్లో చాలా వైభవంగా

చేస్తారు.      ఆ సందడి గుర్తుకొస్తే చాలు చిన్న పిల్లవాడైపోతాడు కామేశ్వరరావు. తరచూ పిల్లలకి కూడా ఆ కబుర్లే చెబుతుంటాడు. ఊరెళ్ళి, అటునించి అక్కడికి దగ్గరగానే ఉండే అత్తారింటికి వెళ్ళి రావాలి అనుకొంటుండగా అన్నయ్య ఫోను. బాగానే కుదిరిందిలే అనుకున్నాడు కామేశ్వరరావు.

అన్నయ్య, వదినల మాటలని బట్టి ఊళ్ళో సిద్ధాంతి గారికి జాతకాలు చూపించి, ఆయన సలహాలు తీసుకోడం ప్రధానంగా వాళ్ళు పెట్టుకొన్న పని. ఎప్పట్నించో వస్తుందనుకున్న అన్నయ్య ప్రమోషన్ ఇంకా రాకపోవడం, అబ్బాయికి అనుకున్నంత పెద్ద పేకేజ్ తో కేంపస్ ఉద్యోగం రాకపోవడం, అమ్మాయికి అమెరికా సంబంధం ఖాయం అనుకొనేంతలో ఇట్టే తప్పిపోవడం, రాష్ట్రం విడిపోడంతో విపరీతంగా పెరిగిపోతాయని కొన్న స్థలాలకు రేటు పెరగకపోవడం, ఇలా సమస్యలు చుట్టుముట్టడంతో తమ జాతకాలు చూపించుకొని, అదృష్టం ఎప్పుడు కలిసొస్తుందో అడగడానికి, సిద్ధాంతి గారి దగ్గరకి వెళుతున్నారు.

కామేశ్వరరావు తండ్రి కాలం నుంచి కూడా సిద్ధాంతి గారంటే వాళ్ళ ఊళ్లోనే గాక, చుట్టుపక్కల ఊళ్ళలో కూడా మంచి పేరు. నిజానికి సిద్ధాంతి గారు ఉపాధ్యాయునిగా ఉద్యోగం చేసినా, ఆయనకు వంశపారంపర్యంగా వచ్చిన పౌరోహిత్యం, జాతక, వాస్తు పరిశీలనల మూలంగానే మంచి పేరు, ప్రఖ్యాతి. ఆయనలో ఉన్న గొప్పతనం ఏంటంటే – మాటల ద్వారా కొండంత భరోసా ఇచ్చి, మనుషులకి మానసికంగా భారం తగ్గించి, చిన్న చిన్న సూచనల ద్వారానే ఎక్కువ ఖర్చులు చేయించకుండా జాతక దోషాలకు నివారణ సూచనలు ఇస్తారని పేరు. జాతకాల మాట ఎలా ఉన్నా, జీవితం పట్ల ఆయనకు ఉన్న సానుకూల దృక్పథం, ఆయన గడిపే నిరాడంబర జీవితం అంటే కామేశ్వరరావుకి, వాళ్ళ కుటుంబానికి చాలా ఇష్టం. అందుకనే, ఏదైనా సమస్య వచ్చినప్పుడు, సిద్ధాంతి గార్ని కలిసి స్వాంతన పొందుతారు. అయితే, కామేశ్వరరావు వాళ్ళ ఇంటికి వెళ్లి దాదాపు ఏడెనిమిది సంవత్సరాలైపోయింది. మధ్యలో ఒకటి రెండు సార్లు ఫోన్లో మాట్లాడడమే. అదీ – సిద్ధాంతి గారి చిన్నబ్బాయి, తన క్లాసుమేటు రామశర్మతో.

కబుర్లలో ఉండగానే, అమలాపురం వచ్చేసింది. బస్సు దిగి, ఆటోలో ఊరికి చేరారు అందరూ. ఊళ్ళో చుట్టాలు ఉన్నా, ముందుగా సిద్ధాంతి గారింట్లో పని చూసుకొనే వెళ్దాం అనుకొని, వారింటికి వెళ్ళారు. తలుపు కొట్టేటప్పటికి పద్దెనిమిది, పంతొమ్మిదేళ్ళ వయసున్న ఒక అమ్మాయి వచ్చి తలుపు తీసింది.      సిద్ధాంతి గారి మనవరాలేమో అనుకుంటూనే....వాళ్ళు “సిద్ధాంతి గారున్నారామ్మా?” అని అడిగిన ప్రశ్నకి, “లోపలికి రండి, తాతగారు, నాన్నగారు భోం చేస్తున్నారు....కూర్చోండి” అంటూ వాకిట్లో కుర్చీలు వేసింది. “సమయం పదకొండే కదా – అప్పుడే భోజనాలా?” అని కామేశ్వరరావు అంటుంటే, “మరి సెలవు రోజుల్లో ఊళ్ళల్లో అంతే కదా – పైగా, నవరాత్రులు పూజలు అవీ చేసుకొంటూ ఉంటారుగా.. మనలా కాఫీలు, టిఫిన్లు గొడవలుండవు పొద్దున్నే...” ఇలా మాట్లాడుకుంటూ లోపలికి వెళ్ళబోతూ, ఏదో గుర్తొచ్చిన వాళ్ళల్లా అంతా, చెప్పులు విప్పి, గోలెంలో నీటిలో కాళ్ళు కడుక్కొని లోపలికి వెళ్ళారు.

పూర్వంతో పోలిస్తే పెద్దగా మార్పులేని ఆ ఇంటిని కామేశ్వరరావు పరిశీలించి చూస్తుండగా, వాళ్ళ అబ్బాయి, అక్కడున్న

ఉయ్యాల బల్ల మీదకి ఎక్కి ఆనందంగా ఊగుతున్నాడు. కామేశ్వరరావు అన్నయ్య అక్కడ న్యూస్ పేపర్ చదూతుంటే, ఆడవాళ్ళు కబుర్లలో మునిగిపోయారు – అక్కడ మొక్కలు, చెట్లు, ఇల్లు విశేషాలు చూస్తూ. కామేశ్వరరావు చిన్నప్పుడు రామశర్మతో, ఇతర స్నేహితులతో ఆడుకున్న ఆటలని గుర్తు చేసుకొంటున్నాడు. సిద్ధాంతి గారి ఇంటి వెనుక పెద్ద దొడ్డి, తమ ఇంట్లో లాగానే ఉన్నా, వాళ్ళ దొడ్లో ఎక్కువగా జామ చెట్లు, రేగు చెట్లు ఉండడంతో, పిల్లలంతా వాళ్ళ దొడ్లోనే చేరేవారు. ఏ పండగ వచ్చినా సందడి వాళ్ళ దొడ్లోంచే...ఇలా కామేశ్వరరావు ఆలోచిస్తుండగానే, సిద్ధాంతి గారు, రామశర్మ, రామశర్మ వాళ్ళ అన్నయ్య అవధాని ముగ్గురూ వచ్చారు లోపల్నించి.

సిద్ధాంతి గారు చాలా పెద్దవారైపోయారు. అయితే, ఆ ముఖం లోని తేజస్సు మరింత పెరిగిందనిపించింది. పలకరింపులు, పరిచయ వాక్యాలు అయిపోయాక, కామేశ్వరరావు అన్నయ్య తను వచ్చిన విషయం గురించి సిద్ధాంతి గారితో మాట్లాడుతున్నాడు. జాతక చక్రాలు చూపిస్తూ సందేహాలు అడుగుతున్నాడు. రామశర్మ, అవధాని కామేశ్వరరావుతో చాలా ఆప్యాయంగా కబుర్లు చెబుతుండగా, అవధాని భార్య, రామశర్మ భార్య బయటకు వచ్చారు. అప్పుడే పూజలు, వంటలు, భోజనాల పనులు పూర్తయి బయటకు వచ్చినట్లున్నారు. పూర్వ పరిచయాలు ఉన్నవారే అవడంతో, ఆడవాళ్ళు పరస్పరం పలకరించుకొని కలిసిపోయారు. వాళ్ళను చూస్తుంటే కామేశ్వరరావుకి, తన చిన్నప్పుడు చూసిన వాళ్ళ అత్తగారిని చూసినట్లే ఉంది- వాళ్ళ కట్టు, బొట్టు, పలకరించే తీరు. అప్పుడే గుర్తొచ్చి “అవును అత్తయ్య గారేరి? లోపలున్నారా?” అని అడిగాడు కామేశ్వరరావు – చిన్నప్పటి వరసలు గుర్తు తెచ్చుకొంటూ. “అమ్మకి ఈ మధ్య ఒంట్లో బాగుండడం లేదు” అనడంతో, “ఔనా….తెలిదే...ఏమైంది?” అంటుంటే, వాళ్ళ పెద్ద కోడలు, “రండి, చూద్దురు గాని లోపలున్నారు” అంటూ లోపలికి దారి తీసింది. వెనకనే కామేశ్వరరావు, మిగిలిన వాళ్ళు లోపలికి వెళ్ళారు.

అక్కడ మంచం మీద గుర్తు పట్టలేని రీతిలో ఉన్నారు వర్ధనమ్మ గారు. మనిషి పూచిక పుల్లలా అయిపోయి, కళ్ళు గాజు గోళీల్లా, బుగ్గలు లోతుకి పోయి పూర్వపు నిండైన రూపమంతా మాయమైపోయింది. నుదుటి మీద రూపాయి కాసంత కుంకుమ బొట్టు మాత్రం అలానే ఉంది. ఆవిడని ఆ స్థితిలో చూసిన వాళ్లకెవరికీ నోట మాట రాలేదు. సిద్ధాంతి గారు, వర్ధనమ్మ గారు అంటే – ఆ ఊళ్ళో పార్వతీ పరమేశ్వరులని పేరు. ఏ పెళ్ళి, పేరంటం అయినా, ఈ దంపతులకే ప్రథమ తాంబూలం. పైగా ఉమ్మడి సంసారంలోకి చిన్న వయసులోనే కోడలుగా వచ్చిన ఆమె, జీవితమంతా పని, పని అంటూనే గడిపింది. అత్త, మామల సేవలు, భర్తకు ఉద్యోగానికి, పూజాదికాలకి అన్నీ సమయానికి అమర్చడం, తమ పిల్లలతో పాటుగా, తోడికోడళ్ళ పిల్లలు, ఆడపడుచుల పిల్లలు, అందరి మంచి చెడ్డలూ బాధ్యతగా చూడడం--- ఇలా ఆమెను ఎప్పుడూ పని చేస్తూ ఉండగానే చూసేవాడు కామేశ్వరరావు. అయితే, ఏనాడు ఆమె ముఖంలో విసుగు గాని, చిరాకు గాని ఉండేవి కావు. అత్త మామలకు, భర్తకు మడిగా చేయవలసిన పనులన్నీ చేసి పెట్టి, చుట్టు పక్కల వాళ్లకి కావలసిన సాయానికి కూడా ముందుండేది. ఆవిడ అంటే – కామేశ్వరరావు తల్లికి చాలా స్నేహం, అభిమానం.

అలాంటి ఆవిడ ఇలా అయిపోవడం చూసిన వారికెవరికీ నోట మాట రాలేదు. ఎన్ని పూజలు, వ్రతాలు, ఉపవాసాలు చేసేది ఆమె? ఏమైపోయాయి ఆ ఫలితాలన్నీ? ఆవిడ కళ్ళతోనే వాళ్ళని పలకరించి నవ్వారు. “ఎలా ఉన్నారు పిన్నిగారూ?” అన్న

కామేశ్వరరావు వదిన ప్రశ్నకు "బానేవుందమ్మా- ఇదుగో నా అదృష్టం కొద్దీ వీళ్ళిద్దరూ ఉన్నారుగా..." మాట నూతిలోంచి వచ్చినట్లున్నా, అందులో ఆప్యాయత ధ్వనిస్తూనే ఉంది. "అసలేమైంది?" అన్న కామేశ్వరరావు ప్రశ్నకి, "మూడేళ్ళ క్రితం సడన్ గా పక్షవాతం వచ్చింది, వైద్యంతో కోలుకున్నారు అనుకొంటుంటే, బాత్రూం లో జారి పడడంతో .....ఇదిగో...ఇలా ...అన్నీ మంచం మీదే...గత ఏడాదిగా అసలు నడవడం లేదు"......అంటూ చెప్పింది వాళ్ళ పెద్ద కోడలు. పండగ కదా అందుకని, కొత్త చీర వర్ధనమ్మ గారి మీద దుప్పటి కప్పినట్లు కప్పారు.

ఆడవాళ్ళు మాట్లాడుతుంటే, ఇంక అక్కడ ఉండలేక బయటకు వచ్చేసిన కామేశ్వరరావు, రామశర్మతో "అయ్యో చాలా దురదృష్టంరా....అత్తయ్యగార్ని ఇలా చూస్తే బాధగా ఉంది...." అంటూ తన మనసులోని మాటను అనుకోకుండానే బయట పెట్టేసాడు. ఆ మాటకు అడ్డు తగులుతున్నారా అన్నట్లుగా ఇద్దరు అన్నదమ్ములు ఒకేసారి – "ఇంకా మా అదృష్టం కదా – అమ్మ మాట్లాడులోంది. మేము చెప్పే విశేషాలు ఆమెకి వినపడడం కొంచెం కష్టంగా ఉంది కాని, తను చెప్పదలచుకున్నవి చెబులోంది." అన్నారు. వెనకే వచ్చిన పెద్ద కోడలు - "అవునండీ – మా అత్తయ్య గారు ఆ స్థితిలో ఉన్నా కూడా అలా మాట్లాడుతూ ఉండడం మా అదృష్టం – పెద్దవాళ్ళు మాకు ఎదురుగా ఉన్నారు అంతే చాలు- మాది, పిల్లలది నిజంగా అదృష్టమే" అంటుంటే, అవే మాటలను తన చూపులతో వ్యక్తం చేసింది చిన్న కోడలు.

అలా బయటికి వచ్చి కబుర్లు చెప్పుకుంటుంటే, పళ్ళేల నిండా రకరకాల ప్రసాదాలు తీసుకొచ్చారు ఆ ఇద్దరు కోడళ్ళు. ఆరోజు దుర్గాష్టమి పూజ చేసామని, అనుకోకుండా మేము రావడం తమ అదృష్టం అని చెప్పి, కామేశ్వరరావు భార్యకి, వదినకి తాంబూలం ఇచ్చి, చీరలు పెట్టారు. అవధాని, రామశర్మలతో మాట్లాడుతున్న కామేశ్వరరావు, వాళ్ళ ఉద్యోగ విశేషాలు అడుగుతున్నాడు. అవధాని సెకండరీ గ్రేడ్ టీచరుగా జాయిన్ అయ్యి దాదాపు 20 సంవత్సరాలు అవులోంది. పక్కనే ఉన్న మరో ఊర్లో కొలువు. బండి మీద పది నిమిషాల ప్రయాణం. "అదేంటి? ఇన్నాళ్ళయినా ఇంకా స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ రాలేదా? ఈపాటికి నీకు లెక్చరర్ వరకు ప్రమోషన్ వచ్చుంటుంది అనుకుంటున్నా.." – అంటూ ఆశ్చర్యంగా అడుగుతున్న కామేశ్వరరావుకి నవ్వుతూనే సమాధానం చెప్పాడు – అవధాని. "నా అదృష్టం బాగుంది. కనకనే దగ్గరలో చేస్తున్నా – అదే ప్రమోషన్ వస్తే –పోస్టింగ్ చాలా దూరం వేస్తున్నారు- అందుకని ప్రస్తుతానికి అది రాకపోవడమే మంచిది." అన్నాడు.

ఏం మాట్లాడాలో తెలీని కామేశ్వరరావు తన క్లాసు మేట్ రామశర్మ తో కబుర్లు ప్రారంభించాడు. "ఏరా, ఇంక ప్రభుత్వ ఉద్యోగం ఆశలు లేనట్లేనా? ఎమ్మెస్సీ బియిడి చేసాక కూడా, నీకు ఏ పోస్టూ రాకపోవడమేంటిరా? నీ దురదృష్టం కాకపోతే, నీకన్నా తెలివి తక్కువ వాళ్ళం అంతా మంచి ఉద్యోగాల్లోనే సెటిల్ అయ్యాం" బాధగా అన్నాడు కామేశ్వరరావు. రామశర్మ మాత్రం నవ్వుతూ – "అదేం లేదురా, నేను అదృష్టవంతుడినే – ఉమ్మడి కుటుంబమే కదా – అన్నయ్యే బాధ్యత తీసుకుంటూ ఉంటాడు. పైగా, నా అదృష్టం కొద్దీ దగ్గరలోనే ఈ మధ్యనే ఒక ప్రైవేటు జూనియర్ కాలేజ్ పెట్టారు – పరవాలేదు జీతం, గౌరవం సంతృప్తికరంగానే ఉన్నాయి. పాపం ఆ అవకాశం లేని వాళ్ళు మన ఊళ్ళో చాలా మందే ఉన్నారు." కామేశ్వరరావు ఇంకేం మాట్లాడాలో తెలీక పిల్లల గురించి అడిగాడు. "అన్నయ్యకు అబ్బాయి, అమ్మాయిరా – అదృష్టం కొద్దీ బాగా చదివే పిల్లలే. అబ్బాయి అమలాపురంలో బిఎస్సీ చదువుతున్నాడు, అమ్మాయి నేను చెప్పే కాలేజ లోనే ఇంటర్ సెకండియర్....ఇక నాకు ఇద్దరూ పాపలే. ప్రస్తుతం హైస్కూలు చదువులు- ఊళ్ళో స్కూల్లోనే. పండగకి వాళ్ళ అమ్మమ్మ ఇంటికి వెళ్లారు."

బయట వరండాలో సిద్ధాంతి గారితో మాట్లాడుతున్న వాళ్ళ అన్నయ్య దగ్గరకు వెళ్లి కూచున్నాడు కామేశ్వరరావు. జాతకాలు చూపించుకోవడం అయిపోయినట్లుంది- ఇతర విశేషాలు మాట్లాడుకుంటున్నారు. "ఎలా ఉంది మావయ్య గారూ, మీ ఆరోగ్యం? బాగా నీరసపడిపోయారు ఇదివరకటి మీద…" అంటూ యోగక్షేమాలు అడగడం ప్రారంభించిన కామేశ్వరరావుతో "దివ్యంగా ఉందోయ్ ఆరోగ్యం – వేళపట్టుకి సంధ్యావందనం చేసుకొని, స్వామికింత పూజ చేసుకుంటున్నా. సాయంత్రం వేళల గుళ్ళోకి వెళితే, నలుగురు జనాలతో కబుర్లకి లోటు లేదు. నా అదృష్టం కొద్దీ మా అబ్బాయిలు ఇద్దరు నాకు ఏ ఇబ్బందీ కలక్కుండా చూస్తున్నారు. అంత కన్నా అదృష్టం ఏమిటంటే నా కోడళ్ళు నన్ను, ఆవిడని ఆప్యాయంగా చూసుకుంటూ ఉంటారు. ఇంకా అదృష్టం మా మనవళ్ళు – నాతోటే కబుర్లు చెబుతూ కాలక్షేపానికి లోటు లేకుండా చేస్తుంటారు. అమ్మాయి, అల్లుడూ ఉండేది రాజోల్లోనే కదా….నెలకోసారైనా చూసి వెళ్తుంటారు….ఎప్పుడైనా మీలాంటి వాళ్ళు వస్తుంటే కబుర్లు చెబుతూ గడిపేస్తుంటా…" అంటూ నిండుగా నవ్వుతూ "నీ ఉద్యోగం ఎలా ఉంది? పిల్లలు బాగా చదువుతున్నారా….." అంటుంటే, "మీ ఆశీస్సుల వల్ల అంతా బాగుందండీ…" అంటుండగానే కామేశ్వరరావు అన్న "ఇక వెళ్ళొస్తామండీ… మీరు చెప్పినట్లే చేస్తా…మళ్ళా కలుస్తా" అంటూ భార్యతో కలిసి ఆయన కాళ్ళకు నమస్కరించాడు. అతన్ని కామేశ్వరరావు, భార్య, పిల్లాడు అనుసరించారు.

అందరి దగ్గరా సెలవు తీసుకొని, బయటకు వచ్చాక, కామేశ్వరరావు కొడుకు అడిగాడు – "నాన్నా? అదృష్టం అంటే ఏమిటి?" అని. "అదేంట్రోయ్… సడన్ గా ఆ పదం ఎందుకు గుర్తొచ్చింది…? అన్నాడు వాళ్ళ పెదనాన్న. "ఏం లేదు పెదనాన్న గారూ….వాళ్ళింట్లో ఎవరు మాట్లాడినా, ఏమి మాట్లాడినా "అదృష్టం కొద్దీ…అంతా బాగుంది… అని చాలా సంతోషంగా అంటున్నారు" అన్నాడు. కొడుకు తలని నిమురుతూ అన్నాడు– కామేశ్వరరావు "అదృష్టం అంటే – కంటికి కనబడని సంపద నాన్నా…" "అంటే, శాటిస్ఫేక్షన్ అనుకోవచ్చా?- అడిగాడు వాళ్ళ అబ్బాయి, వాడికేదో అర్ధమైనట్లు. నవ్వుతూ తలూపాడు కామేశ్వరరావు – "అవును కదా, సంతృప్తిని మించిన సంపద ఏముందీ? దాన్ని పొందడం కన్నా అదృష్టం ఏముంటుంది?" అనుకుంటూ.




"ఏంటే కమలా ! ఇంత లేటుగా వచ్చావ్ ? ..నేను పూజ చేసుకోవాలి కదా ఆ మాత్రం బుద్ధి లేదా?"

"అమ్మగారూ! నేను పదింటికే వచ్చా ఎవరో పోలిసమ్మ వచ్చి మీటింగ్ పెట్టారమ్మా..ఈ అపార్టుమెంటులో పని చేసే..పని మనుషులందరినీ మీటింగని సెక్కరటరీ సారు ఆపేసా రమ్మా ఆయమ్మ మాతోనే మాట్లాడాలని చెప్పారని."

"కథలు చెప్పడం నీకు బాగా అలవాటై పోయిందే..పోలిసమ్మ మీతో మీటింగ్ పెట్టారంటే నేను నమ్మాలి. మీటింగే పెట్టిందా..పార్టీ లాంటి దిచ్చిందా..?"

"మీకెలా తెలిసిందమ్మా.? .అందరికీ చాయ్ యిప్పించిందని..?"

అంటూ ఆశ్చర్య పోతూ అయోమయంగా చూస్తున్న..కమలని వింతగా చూస్తూ

“అంటే.. నువ్వు చెప్పేదంతా నిజమే నంటావ్ ? “

“అమ్మతోడమ్మా ..సెక్కరటరీ సారుకు ఫోను చెయ్యండమ్మా ..నేను అబద్ధం చెప్పలేదమ్మా “

చేతిని తలమీద పెట్టుకొని ఒట్టు పెట్టుకుంటున్న కమలను అదోలా చూస్తూ..

“పోలిసమ్మకు మీతో మీటింగేంటే.? .

ఇంతకీ ఆయమ్మ ఏమడిగింది..మీరేం చెప్పారు.. ?

“మరేం లేదమ్మా..మన యపార్టుమెంటులో ఎవరో “అత్త రాక్షసి” కోడల్ని రాచి రంపాన పెడుతోందని రిపోర్టిచ్చారంట..ఆ రిపోర్టులో ఫ్లాటు నెంబరు గాని పేరు గానీ రాయలేదంట. అందుకే మా అందరినీ అడిగి ఏ ఫ్లాటులో..ఎవరెవరుంటారో ..అందులో అత్తాకోడల్లు ఏ ఫ్లాటుల్లో వుంటారో కాగితం మీద రాసుకెళ్లారమ్మా..ఏ అత్తా కోడల్లు గొడవ పడినా సెక్కరట్టీ సారుకు చెప్పాలని చెప్పారమ్మా.”

ఆ సారు ఆ యమ్మకు పోను సేత్తారంట.నిజమని తేలిందా మిముందే చెత్త కొట్టుడు కొట్టి బొక్కలో తోస్తా నన్నారమ్మా..మీలో ఎవరు ఏం చెప్పినా ఆల్ల పేర్లు బయటకు రావని మరీ మరీ సెప్పి నా రమ్మా.మరో మాట కూడా సెప్పినారమ్మా..ఏ అమ్మాయికి అన్యాయం జరిగినా మన అమ్మాయిలకు జరిగి నట్టే నని .ఆమ్మ సెప్పింది నిజమే కదమ్మా..? రేపు నా కూతురూ అత్తోరింటికి ఎల్లేదే కదమ్మా..అసుమంటి అత్తలే కదమ్మా కట్నాలకోసం ..పిల్లలు పుట్టలేదని ..పుట్టినా మగ పిల్లలు పుట్ట లేదని కిరసనాయిలు పోసి పానాలు తీస్తు న్నారు కదమ్మా..?.అయినా ..మొన్నామద్య ఆటల పోటీలు జరిగితే మీసాలు తిప్పుకంటూ..కండలు పెంచుకుని ఎల్లిన అబ్బాయిలంతా..ముకానికి పసుపు పూసుకొత్తే..అమ్మాయిలు అందునా మన తెలుగమ్మాయి తో బాటుమరో యిద్దరమ్మాయిలు..కప్పులు తెచ్చారంటగా..”?

అంటూ చెప్పుకు పోతున్న కమల ముఖం చూడలేక

“కమలా! ముందు హాలంతా వూడ్చెయ్..నేను బాతురూం కెళ్లున్నా”

దడ దడ లాడుతున్న గుండెల్ని అదిమి పెట్టుకుంటూ బెడ్ రూంలోకొచ్చి తలుపులు మూసేసుకుంది..జానకమ్మ..ద సాఫ్ట్ వేర్ ఇంజినీర్ రవీంద్ర తల్లి .నిస్సత్తువగా మంచం మీద పడి పోయిన జానకమ్మ కళ్లముందు కదలాడింది..పోయిన వారం తనకూ రవీంద్ర కూ మధ్య జరిగిన”     సంభాషణ “

** *

“రవీంద్రా! ..మీ నాన్న యాక్సిడెంటులో చనిపోయే నాటికి నువ్వు ఇంటర్ లో వున్నావు. మీ మామయ్య దగ్గర అప్పు చేసి నిన్ను ఇంతవాడిని చేశాను. నీ చెల్లాయిల్ని హాస్టల్లో పెట్టి చదివిస్తున్నాను. కట్నం డబ్బులతో మామయ్య బాకీ తీర్చేద్దామనుకుంటే నువ్వు లవ్వని

నీరజను పెళ్లి చేసుకుని నా నమ్మకాన్ని నీళ్ల పాలుచేశావు”.

“ అవునమ్మా.. నీ దృష్టిలో నేను చేసింది అన్యాయమే..కానీ ఆ బాకీ అంతా నెల నెలా తీరుస్తోంది నీరజ శాలరీ నుంచే కదా. చెల్లాయిలకి హాస్టల్ ఫీజు కూడా నీరజే కడుతోంది.తను లోనుతీసుకుని మరీ మామయ్య     కే యిచ్చింది..దాదాపు మామయ్య బాకీ అంతా తనేగా తీర్చేసింది .?”

“మా తీర్సిందిలే..     బోడి     గొప్పలు చెప్పకు.నిన్ను అల్లుడిగా చేస్తానని మాటిచ్చి అప్పు చేశా. నా మాట నట్టేట్లో ముంచావ్. అయిదేళ్లయింది పెళ్లై..ఓ మనమడినో మనుమరాలినో ఎత్తుకుందామంటే ఆ అదృష్టం కూడా లేదు నా ముఖానికి.నీ పెళ్లాం “గొడ్రాలు.” .దానికి జన్మకిక పిల్లల రాతలేదు.మామయ్యతో మాట్లాడాను..వాడి రెండో కూతురు బంగారు బొమ్మ ..ఎంతంటే అంత కట్నం యిస్తా నంటున్నాడు.”

అమ్మా! నీకెన్నో సార్లు చెప్పాను..నీరజ గురించి నీచంగా మాట్లాడొద్దని.నాన్నకు నువ్వెంతో నీరజ నాకంతే.తననే ఎందుకు ఆడి పోసుకుంటావు..లోపం నాదే నేమో.

“నోరు ముయ్ రా..వెధవా..మీ తాతయ్యకు ఐదుగురు సంతానం..మీ నాన్నకు నీతో బాటు యిద్దరు కూతుళ్లు..నీలో లోపం వుందని మరెప్పుడైనా పిచ్చి కూతలు కూశా వంటే పళ్లు రాల గొడతా.”

అగ్గిమీద గుగ్గిలమై పోయింది జానకమ్మ. మూర్ఖు రాలైన తల్లితో మాట్లాడడం..శుద్ధ వేష్టనే నిర్ణయంతో..మౌనం వహించాడు..రవీంద్ర.

" నీ వేషాలు నాదగ్గర వేయకు..నువ్వేం చేస్తావో..నీ పెళ్లానికేం చెప్పుకుంటావో నీ యిష్టం..ముందు నీ పెళ్లానికి విడాకులివ్వు. నా పెళ్లాం గొడ్రాలని..కోర్టులో చెప్పుకుంటే విడాకులిస్తారని మామయ్య చెప్పాడు.కోర్ట యవ్వారమంతా వాడు చూసుకుంటా నన్నాడు."

" అమ్మా! గట్టిగా అరవకు.నీరజ వచ్చే టైమయ్యింది.యివ్వాళ పేపరు చదివావా? పిల్లలు పుట్టలేదని అత్తింటి వేధింపులతో గృహిణి బలవంతంగా ప్రాణాలు తీసుకుంది.ఈ సంఘటన నిన్ననే చిక్కడపల్లి లో జరిగింది.అత్తగారి వేధింపులతో బాటు ఆడబిడ్డల సూటి పోటి మాటలకు తట్టకో లేక ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది స్రవంతి అనే అమ్మాయి.

స్రవంతి నాన్నగారి ఫిర్యాదుతో రాజశేఖరనే ఆమె భర్తతో బాటు అతని అమ్మానాన్నల్ని ..అక్కా చెల్లెళ్లని పోలీసులు అరెస్ట్ చేశారట."

"ఆ ..నీపెళ్లాం మరీ అంత సున్నితం కాదులే..ముందు నీ సొల్లువాగుడాపి..ఓ మంచి లాయర్ని చూడు."

తల్లి కి ఏంచెప్పినా తలకెక్కదనే ఆలోచనతో కామై పోయాడు రవీంద్ర.జరిగి పోయిన ఆనాటి ఘటనంతా తన కళ్లముందు కనిపిస్తుంటే పోలీసులకు ఇదేమైనా రిపోర్టు యిచ్చి వుంటుందా అనుకుంటూ..ముఖం తుడుచుకుంటూ హాల్లో కొచ్చింది జానకమ్మ.
"అమ్మగారూ ! మీ బెడ్డురూం తుడిచేస్తే నాపనై పోతుంది.అన్నట్టు మీకు యిందాక చెప్పలేదమ్మ ..

ఆ పోలిసమ్మ రెండు మూడు రోజుల్లో మళ్లీ వస్తానన్నరమ్మా ..ఈ సారి ఆ అత్తెవరో తెలిస్తే అంకుశం సినిమాలో హీరో విలన్ని కొట్టినట్టు నడి రోడ్డుమీద కొట్టుకుంటూ తీసుకెల్తే ..నా సామిరంగా.. అది చూసి ఇసుమంటి దగుల్బాజి అత్తలంతా బట్టలు తడిపేసుకుంటారమ్మా.. అమ్మ గారూ అలా జరుగుద్దంటారా..?" వాగుతున్న పని మనిషి ముఖం చూడలేక ..ఏదో పనున్నట్లు కిచెన్ లోకి పారిపోయింది జానకమ్మ. పనైపోయిన కమల

"అమ్మగారూ..! నేను వెల్తా ..నాపనై పోయింది. అయినా అమ్మగారూ మన యపార్టుమెంటులో వున్నోల్లంతా యింజినీర్లూ ..డాక్టర్లూ ..కదమ్మా. కోడల్లని కట్నాలతో ఏదించి సంపాదించిన పాపిష్టి డబ్బుతో ఏం సేత్తారమ్మా..కట్టెలతో తగలబట్టే తమ శవాల్ని కట్టలతో కాల్చుకుంటారంటారా..అయినా యియ్యన్నీ నాకెందుగ్గానీ వస్తానమ్మా.."

కమల వెళ్లపోగానే ..తలుపులు బిగించుకుని మంచంమీద కూలి పోయింది..జానకమ్మ.చెవుల్లో కమల మాటలు ప్రతిధ్వనిస్తుంటే ..కళ్లముందు ఏవేవో దృశ్యాలు బొంగరాల్లా తిరిగి పోతుంటే ..నిస్సత్తువుగా వచ్చి వణికే చేతులతో రవీందర్ ఫోనుకు డైల్ చేసింది.. జానకమ్మ.

***

తన సెల్ ఫోను డిస్ ప్లేలో కనిపించిన షీ టీం హెడ్..తన క్లోజ్ ఫ్రెండ్ రాజు నెంబర్ చూస్తూనే చెప్పరానంత ఆనందంతో హాయ్ రాజూ

అన్నాడు..రవీంద్ర.

ఏరా సాఫ్ట్ వేరూ..! మొన్న మా ఝాన్సీ దెబ్బకు నీ మదర్ తల్లి పాకిస్తానా..పీకిస్తానా..?

"ఆ సంగతి నేనే ఫోన్ చేద్దామనుకున్నాను..మీ వీరనారి ఝాన్సీ ..తెలివికి నా హేట్స్ ఆఫ్ రా.ఎవరితో మాట్లాడకుండా..ఫ్లాట్ అంబాసిడర్ల వంటి పని మనుషులతో మా అమ్మలవంటి శూర్పణకలకు వార్నింగులు..పంపించిన ఝాన్సీ ప్లానుకు నా జోహార్.సందేశమేంటో నాకు తెలీదు గానీ రిజల్ట్ మాత్రం..నా తల్లి పరార్. మా అమ్మ ఆ రోజు మధ్యాహ్నమే ఫోన్ చేసి మీ మామయ్యకు సీరియస్ అంటున్నారు..రాత్రి బస్ కు బుక్ చెయ్యమని చాలా సీరియస్ గా ..ఆందోళనగా చెప్పింది.

అమ్మా ! ఇప్పటి కిప్పుడు ప్రయాణ మేంటమ్మా?

రేపు ట్రై చేద్దామంటున్నా వినకుండా రిజర్వేషన్ లేకపోయినా ..వెళ్లిపోతానని మంకు పట్టు పట్టింది.మొన్న నీకు ఫోన్ ఎందుకు చేశానో అదే నెరవేరుతుంటే ఆనందం పట్టలేక కావలసినంత విచారాన్ని నటించి ఆ రాత్రే బస్సెక్కించి..బరువు దింపుకున్నాన్రా.ప్రేమలు పంచే వాళ్లు తల్లులు గానీ..పిల్లలతో వ్యాపారం చేసే వాళ్లు తల్లులెలా అవుతారు చెప్పు.?సరే.. సరే.. మరీ ఎమోషనల్ గాకు.. ఆరోజు నువ్వు నీ సమస్య చెప్పగానే మా "షీటీం మెంబర్స్ తో " మీటింగ్ పెట్టి నీ సమస్య చెప్పాను,.ఝాన్సీయే పరిష్కారం చెప్పి రేగింగ్ ..ఈవ్ టీజింగ్ ..లతో బాటు డౌరీ హెరాస్ మెంటును కూడా మన షీ టీంలో యాడ్ చేస్తే బాగుంటుందని సలహా యిచ్చింది.డిపార్టు మెంటు ఓకే అనగానే ఫస్ట్ ట్రయల్ నీతోనే స్టార్ట్ చేశాం.నువ్వు చెప్తుంటే అర్థమై పోయింది.మా ప్లాన్ సూపర్ హిట్టని. ఇది మరో టైపు ..సర్జికల్ స్ట్రైకని..అన్ని అపార్ట్ మెంటులతో బాటు రాష్ట్రం మొత్తం ఇంప్లిమెంట్ చేస్తాం ..నీకే మా డిపార్ట్ మెంటు తరపున కృతజ్ఞతల్రా రవీ.!

***

సాయంతం ఆఫీస్ నుంచి వస్తూనే తన భార్యను గిల్టీగా చూస్తూ డాక్టర్ రిపోర్టును ఆమె చేతిలో పెట్టి తన రెండు చెవులూ పట్టుకుని ఐయాం సారీరా నీరూ ! నీకు సంతాన భాగ్యాన్ని కలిగించలేని నా అసమర్ధతను క్షమిస్తావు కదూ? అంటున్న భర్తను ప్రేమతో చుట్టేసి..

“నీ ఫ్రాంక్ నెస్ తో ఫ్లాటైపోయాను .. యువార్ వెరీ గ్రేట్ రా ఇంద్రా! ఐయామ్ నాటోన్లీ యువర్ వైఫ్ ..యువర్ లైఫ్ ఆల్సో..జన్మ జన్మలకీ నువ్వే నా భర్తవి కావాలి” .

నీరజ ఆనంద భాష్పాలతో తడిసి ముద్దయిన రవీంద్ర అర్ధాంగి చేయి పట్టుకుని అనాధ శరణాలయం మెట్లు అధిరోహించాడు..తాము పెంచుకోబోయే కూతురి కోసం*



రమ తల మీదుగా కప్పుకున్న రజ్జాయిలో కుళ్లి కుళ్లి యేడుస్తోంది . ఒక్కగానొక్క కొడుకు కమల్ అనాలోచితంగా అన్న మాటలు రమకి సూటిగా తగిలి పిడికెడంత గుండెని వెయ్యి ముక్కలు చేసేయి .

ఆ మాటలు అంటున్నప్పుడు తల్లి అంత బాధపడుతుందని వూహించి వుండడు కమల్ . అసలు ఆ విషయం చర్చకు వచ్చినపుడు కూడా రమ అనుకోలేదు సంభాషణ అటుతిరిగి యిటుతిరిగీ తన గుండెల్లో గునపాలు గుచ్చుతుందని .

తన మాటలు తల్లిని అంత బాధపెడతాయని తెలిస్తే ఆ చర్చని మధ్యలోనే ముగించెవాడే కమల్ .

సాయంత్రం యెర్రబడ్డ కళ్లతో తిరుగుతున్న తల్లి ని చూసి సున్నిత మనస్కురాలు అనుకున్నాడు కాని తన అనాలోచిత వ్యాఖ్యలు తల్లి గుండెలను చీల్చేయని తెలుసుకోలేకపోయేడు .

ముప్పైఅయిదు సంవత్సరాలుగా ఒకే ప్రాణంగా బతుకుతున్న తన భర్తకి కూడా తెలియకుండా గుండెల్లోనే సమాధి చేసిన రహస్యం , యిన్నేళ్ల తరవాత తనను అల్లకల్లోల పరుస్తుందని వూహించలేక పోయింది రమ .

ముప్పైఅయిదేళ్ల కిందట పురిటిగదిలో కేరు కేరు మంటూ యేడుస్తూ వేలకత్తులతో తన కడుపు చీల్చుకొని పుట్టిన బిడ్డ కొద్ది నిముషాలలో తెల్లని బట్టలో చుట్టి శ్మశానానికి తరలిస్తూ వుంటే నమ్మలేని తల్లి పేగు బిడ్డని తనచేతులలో కి తీసుకొని అణువణువు తడిమి బిడ్డలో ప్రాణం పోయాలనే తపనకు అడ్డు పడిన అమ్మానాన్నలను అనుమానంగా చూసింది .

తొమ్మిదినెలలు తనలో పెరిగి మురిపించినది బాబా ? పాపా ? , తెలుసుకోవాలని చేసిన ప్రయత్నం ఫలించలేదు . ఒక రోజు బాగా విసిగిపోయిన తల్లి ' బతికి తల్లితండ్రులను విడదీసే దెయ్యంపిల్ల గురించి ఆలోచించకు , వచ్చేయేటికి మంచి బిడ్డని యెత్తుకుందువులే '

దెయ్యంపిల్ల అనేమాటకి చాలా రోజుల తరవాత అర్ధం తెలిసింది . అమ్మా నాన్నలకి గోల్కొండ చూపించడానికి తీసుకు వెళితే అక్కడ అడుక్కుంటున్న ' హిజరా ' ని చూసి " పాపపుణ్యాలు లెక్కవేస్తూ వూరుకొనుంటే నీ కడుపున పుట్టిన దెయ్యంపిల్ల బతుకూ యిలాగేవుండును " . అన్న అమ్మ మాటలకు వులిక్కి పడింది రమ . అడుక్కోడానికి అలా వేషం వేసుకుంటారని భావిస్తున్న రమకి అది పుట్టుకతో వచ్చేలోపమా ? అని మొదటిసారిగా అనిపించింది . తన కడుపున అలాంటి శిశువు జన్మించడం నామోషీగా అనిపించి ఆ విషయాన్ని శాశ్వతంగా తనలో సమాధి చేసేసింది .

దేశం కాని దేశంలో యెప్పుడో మరచిపోయిన విషయం యివాళ చర్చకు వస్తుందని రమ కలలో కూడా అనుకోలేదు .

నాలుగు రోజులుగా వాకింగు కూడా మానేసి బెదురుగా తిరుగుతున్న రమ నుంచి విషయం తెలుసుకోవాలని కమల్ దంపతులు నిర్ణయించుకున్నారు .

మౌనంగా భోజనం చేస్తున్న రమని చూసి నిట్టూర్చేడు కమల్ , డైనింగ్ టేబుల్ దగ్గర యింత నిశ్శబ్దమా ? ఎప్పుడూ లేదు . అందరి వంతు తనే మాట్లాడే రమ మౌనంగా భోజనం చెయ్యడం అంటే అదో పెద్ద వింతే మరి . స్వరూప భర్త సౌజ్ఞ అందుకొని " వంట్లో బావుండటం లేదా ? అత్తయ్యా " అంది .

" బావుందే " యెంత నార్మల్ గా అందామన్నా రమ గొంతులో సంశయం ధ్వనించింది .

" మీలో ఏదో మార్పు కనిపిస్తోంది , అలసటగా కనిపిస్తున్నారు , యిన్నాళ్లు మామగారిని వొంటరిగా వదలి వుండలేదేమో కదా ? యిండియా వెళ్లి పోదామనిపిస్తోందా?,

నిద్ర పట్టడం లేదా ? " చాలా కేరింగ్ గా అడిగింది స్వరూప .

" అబ్బే అదేమీ లేదు "

"యేమీ లేదా ? మరి మూడు రోజులుగా ఆ మౌనం , శుభా గాడితో ఆటలు పాటలు లేవు , నీ కిష్ట మైన వాకింగ్ కుడా మనేశావు ఏం జరిగిందో చెప్పక పోతే మాకేలా తెలుస్తుంది " కమల్ తల్లిని పరిశీలనగా చూస్తూ అన్నాడు .

" వారంరోజుల కిందట వాకింగుకి శుభా గాడితో వెళ్లానా ? అక్కడికి వీడి వయసు అబ్బాయిని తీసుకొని ఒక స్వీడన్ దేశస్థుడు వచ్చాడు . ఆ పిల్లాడిని వాళ్లు పెంచుకుంటున్నారని పిల్లల పెంపకం గురించి అతని భార్యకి సలహాలు కావాలని చెప్పేడు . మరునాడు మరో మగాడిని తెచ్చి వాళ్లావిడగా పరిచయం చేసేడు . వాళ్లడిగినవాటికి సమాధానాలు చెప్పేను గాని వాళ్లిద్దరిని భార్యాభర్తలు గా అంగీకరించలేకపోయేను . ఎంత తొందరగా అక్కడనుంచి బయటపడదామా ? అని యెదురు చూసేను . వాళ్లు వెడుతూ మళ్లా యిక్కడే కలుద్దామని ఈ సారి నన్ను వాళ్లింటికి తీసుకు వెళతామని అన్నారు . అందుకే వాకింగుకి వెళ్లడం మానేసేను " అంది రమ .

" ఈ దేశం లో యిలాంటివి మామూలే అమ్మా "

" మామూలేంటిరా వాళ్లు ప్రకృతికి విరుద్ధంగా నడుస్తూ వుంటే మీకెవరికి చీమ కుట్టినట్టు కూడా లేదు , యిలాంటివి సమాజంపై యెంతటి ప్రభావం చూపిస్తాయో మీకెమైనా అవగాహన వుందా?, వీళ్లలాగే అంతా ఆడ ఆడ , మొగమొగ పెళ్లిళ్లు కాపరాలు అంటూ వుంటే మానవ జాతి అంతరించి పోదూ , వాళ్లు పెంచుకున్న పిల్లలని సమాజం అంగీకరిస్తుందా ? వాళ్ల భవిష్యత్తు అంతా జవాబు లేని ప్రశ్నలే , ప్రశ్నలతో మొదలు పెట్టిన బతుకు భవిష్యత్తు లో పెద్ద ప్రశ్నగా మారదూ ? , మన దేశంలో పెళ్లిళ్ల లో డబ్బులు దండుకోడానికి వచ్చేవాళ్లలా కుడాలేరు , మాములుగా మగవాళ్ళ లాగే వున్నారు , ఆ పెంచుకోనేదేదో శుభ్రమైన పెళ్లి అంటే నా వుద్దేశ్యం శుభ్రంగా యిద్దరు ఆడవాళ్ళని పెళ్లి చేసుకొనే చెయ్యొచ్చు కదా అని " . దుఃఖం తో సన్నగా వణుకుతున్న గొంతు తో అంది రమ .

" నే చెప్పలే మా అమ్మ వూరికూరికే భయ పడుతుందని , నువ్వు వెళ్లి నీ కొడుకు దగ్గర రెస్ట్ తీసుకో , నేను మా అమ్మని కొంచం ఎడ్యుకేట్ చేసి వస్తా " . స్వరుపతో అని రమ వైపు తిరిగి

" అమ్మా ఈ సమాజం లో తాగుబోతులు , తిరుగుబోతులు , దొంగలు , మహిళల పై అత్యాచారం చేసే మానవ మృగాలు వుండగా జరుగని నష్టం ప్రపంచ జనాబాలో ఒక శాతం కూడాలేని వీళ్ల వల్ల జరుగుతుందా ? . తెలిసి అన్నావో తెలికే అన్నావో గాని మానసిక రోగులని అది నిజంగా నిజం , వాళ్ళు మానసిక రోగులే . వాళ్ళకీ తెలుసు తమలో జరుగుతున్న సంఘర్షణ ప్రకృతికి విరుద్ధమని , దానిని అణిచి వుంచడానికి చెయ్యగలిగిన ప్రయత్నాలన్నీ చేస్తారు .ఎప్పుడైతే ఆ సంఘర్షణ అగ్నిపర్వతమై బద్దలౌతుందో అప్పుడు వాళ్లు యిలాంటి నిర్ణయం తీసుకోడం జరుగు తుంది . ఇలాంటి ప్రకృతి విరుద్ధ మైన పెళ్ళిళ్ళలో పిల్లలు పుట్టరు , కాని వారికి పిల్లలని పెంచి పెద్ద చెయ్యాలనే కోరిక వుంటుంది , వాళ్లు అడాప్షన్ సెంటర్ నుంచి పిల్లలని తెచ్చుకుంటారు . అనాధ పిల్లలని పెంచుకొని వొక రకంగా వీళ్లు సమాజానికి సేవ చేస్తున్నట్లే కదా ? అన్నాడు కమల్ .

" యిది సమాజం మీద యెంత చెడు ప్రభావం చూపుతుందో......... ? వీళ్లని చూసి అందరూ యిలాగే చేస్తే " .

" అందరూ అలా చెయ్యరమ్మా కొందరే యిలాంటి వాళ్లు వుంటారు ".

" మగాడు తల్లెంటిరా ? "

" అమ్మ తనాన్ని లింగభేదం తో కాకుండా మనసు తో చూస్తే నీకు అర్ధం అవుతుంది , యిక మనదేశంలోని హిజరాలు అని పిలువబడే వాళ్లు కూడా నాలాగ , నీలాగ అమ్మ కడుపులోంచి పుట్టినవాళ్లే కాని ఆకాశం మించి వూడిపడరమ్మా " .

" వీళ్లని యిలా దేశం మీద వదిలేసే బదులు పురిట్లోనే గొంతునులిమి చంపేస్తే దేశానికి సగం దరిద్రం తీరుతుంది " కొడుకు తర్కం తో యేకీభవించలేని రమ అంది .

" దేశదరిద్రం వీళ్లని చంపితే తీరదమ్మా , దేశ సంపదను పందికొక్కుల్లా తినేస్తున్న అవినీతిపరులను చంపాలి . వీళ్లవల్ల సమాజానికి కీడు అనుకుంటున్న నీఆలోచలని చంపాలి . వికలాంగుల కోటా వీరికందకుండా చేస్తున్న అధికారులని చంపాలి , సంఘవిద్రోహులకు , అతి తెలివిగా దేశ ఆర్ధిక వ్యవస్థకి గండి కొట్టి తమ ఖజానా నింపుకుంటున్నవారిని , వారికి అండగా నిలిచి రాజ్యాంగాన్ని తిరగరాయగలిగే ప్రభుద్దులను చంపాలి , వీరి శక్తి సామర్ధ్యాలని వుపయోగించుకో లేకపోయిన మన దౌర్భాగ్యపు ఆలోచనలను చంపాలి , జంతువుల హక్కుల కోసం పోరాడు తున్న వారు వీరు జంతువులు కారు కాబట్టి వీరిని పట్టించు కోలేదు . మా పోరాటం కేవలం మహిళలకే అన్నాయి మహిళా సంఘాలు . తరతరాలుగా వంచింపబడుతున్న జాతి యేది అంటే ఈ మూడో జాతే . కన్న తల్లితండ్రులే మీరు మాకు బరువు అని వదిలేస్తే వారినియే సంఘాలు మాత్రం వుద్ధస్తాయి . శారీరిక , మానసిక యెదుగుదల లేక పుట్టిన పిల్లలను అక్కున చేర్చుకోగలిగే సహనం గల అమ్మ యిలాంటి బిడ్డ పుట్టేడని తెలియగానే గుట్టు చప్పుడు కాకుండా వదిలించుకుంటోంది అంటే అది ఆ అమ్మ తప్పా ? , లేకపోతే తమ పుట్టుకలోని లోపం యేమిటో తెలియని ఆ పురిటి గుడ్డుది తప్పా , లేక పోతే మనలో మనకు తెలియకుండా పాతుకు పోయిన మూఢనమ్మకందా ? చెప్పమ్మా చెప్పు . " కమల్ గొంతులో ఆవేదన తొంగి చూసింది .

" ఇలాంటి పిల్లలు యే వూరిలో పుడితే ఆ వూరికే అరిష్టం , యే తల్లి కడుపున పుడితే ఆ తల్లిని అమ్మవారికి బలియిచ్చెస్తారుట తెలుసా ? " నరనరానా జర్జించుకు పోయిన మూఢనమ్మకం రమ నోటంట పలికింది .

" పుట్టిన బిడ్డ గుడ్డివాడని తెలియగానే బ్రెయిలిని అతని తల్లి గొంతునులిమి చంపేసి వుంటే ప్రపంచంలోని గుడ్డివారికి చదువుకొనే అవకాశం కలుగకపోను కదమ్మా ? . ఏ కాలంలో వున్నామమ్మా మనం , ' సంపన్న దేశాలకన్నా మన ఆర్ధిక వ్యవస్థ బలమైనది ' అని గుండెలు బాదుకుంటే రాదమ్మా ప్రగతి . ఇప్పటికైనా మనం కళ్లు తెరిచి యిలాంటి వారికి వృత్తి విద్యలలో శిక్షణ యిచ్చి మనదేశం మరచిపోయిన ఒక జాతికి చేయూత నివ్వాలి . విద్యావకాశాలు కల్పిస్తే వారిలో యెందరో డాక్టర్లు , యింజనీర్లు అయి దేశ సేవ చేసేవారు " . పెద్దగా వినిపించిన వెక్కిళ్ల శబ్దానికి యీలోకం లోనికి వచ్చిన కమల్ నోటికి కొంగు అడ్డం పెట్టుకొని బెడ్రూము లోకి వెళ్లి తలుపేసుకున్న తల్లిని బిత్తరపోయి చూసేడు .

------ ---------
----------

ఆరు నెలలు మనవడితో ఆడుకుంటానని వచ్చిన తల్లి తిరుగు ప్రయాణానికి సిద్ధపడుతూవుంటే యెలా వారించాలో తెలీక తికమక పడుతున్న కమల్ ని చూసి చల్లగా నవ్వింది రమ .

" నీ మీద కోపం తో వెళ్లటం లేదు నాన్నా , చిన్నవాడవయినా నా కళ్లు తెరిపించి యెంతో యెత్తుకి యెదిగిపోయేవురా ? నాన్న రిటైర్ అయ్యాకా కాలక్షేపం కోసం గోసేవ చేసుకుంటూ పుణ్యం సంపాదించుకొని పునర్జన్మ లేకుండా చేసుకుందామనుకొన్న సంగతి నీకు తెలిసిందే కదా ? నిన్న నీ మాటలతో నా కళ్లు తెరచుకున్నాయి . యెవరో వచ్చి యేదో చెయ్యాలని  యెదురు చూసే బదులు , ఆ చేసేదానికి నేనే నాంది పలకాలి అని నిర్ణయించుకున్నానురా , నాన్న తో కూడా మాట్లాడేను , నాన్నకూడా సరే అన్నారు . మంచి పనికి ఆలస్యమెందుకని బయలుదేరుతున్నాను నాన్నా " అంటున్న రమని చుట్టుకుపోయి " నువ్వెంత మంచి దానవమ్మా , దేశం మరచిపోయిన జాతి కోసం నడుం బిగించిన నువ్వు చాలా గ్రేట్ , ఐ యాం ప్రౌడాఫ్ యూ అమ్మా , ఐ యాం ప్రౌడాఫ్ యూ " అంటూ వంగి తల్లికాళ్లు కళ్లకద్దుకున్నాడు కమల్ .

కొడుకు తల పై చెయ్యి వేసి ఆశీర్వదించి పెట్టె సర్దుకోడంలో మునిగి పోయింది రమ .

" నువ్వనుకుంటున్నంత గొప్పదానను కానురా నాన్నా , నీ దగ్గర నిజం వొప్పుకోలేని యీ పిచ్చి తల్లిని క్షమించు తండ్రీ " అని మనసులో అనుకుంటూ సామాను సర్దుకోడంలో మునిగిపోయింది .




ఈసారి దీపావళి పండుగ ఎలా జరుపుకుంటున్నారు ? " 9 వ తరగతి సైన్సు మాస్టార్  సుబ్బారావు గారు క్లాస్ నుద్దేశించి అడిగారు. "క్రిందటి  సంవత్సరం దసరా దీపావళి పండుగలకు మా మామయ్య చైనా లో తయారైన  బోలెడన్ని ఆట బొమ్మలు పంపించాడు సార్.  వాటితో స్నేహితులతో కలిసి చక్కగా పండుగ శలవులలో ఆడుకున్నాము .  ఈ ఏడు కూడా చైనా నుండి వచ్చిన కొత్త కొత్త బొమ్మలు, టపాకాయలు పంపమని మా మామయ్యని అడిగాను" చెప్పాడు మురళి.

"మా డాడీ క్రిందటి దీపావళికి చైనా టపాకాయలు తెచ్చారు సార్. వాటి ధర కూడా తక్కువ అట. కొత్త కొత్త రకాల వింత వింత టపాకాయలు కాలుస్తుంటే ఎంత సంతోషం వేసిందో!!" క్రితం సంవత్సరం తమ ఇంట్లో జరుపుకున్న దీపావళి పండుగను గుర్తు చేసుకుంటూ చెప్పాడు హరి.

"మా బావ గారు, అక్క చైనా లో తయారైన రంగు రంగుల దీపాల తోరణాలు, బ్యాటరీ తో పనిచేసే ప్రమిదలు, రంగు రంగుల లైట్లు తెచ్చారు సార్ . వాటిని మా ఇంటి ముందు వెలిగించితే అంతా వింతగా చూసారు. నాకు కొంచెం గర్వంగా కూడా అనిపించింది" చెప్పింది రాధ.

"ఇవే కాదు సార్. నాకు చిన్న చిన్న ప్రయోగాలు చేయటం, స్వంతంగా ఏవైనా వస్తువులు తయారు చెయ్యటం అంటే ఎంతో ఇష్టం. మా అన్నయ్య నాకోసం చైనా లో తయారైన టూల్ కిట్స్ పంపాడండి. క్రిందటి సైన్సు ఫెయిర్ లో నేను పెట్టిన ఐటమ్స్ ఆ టూల్ కిట్స్ వాడి తయారు చేసినవే" గర్వంగా చెప్పాడు శ్రీధర్.

" మా బాబాయ్ చైనా లో తయారైన జీన్ పాంట్స్, టీ షర్టులు, చేతి గడియారం, పెన్నులు, ఇంకా సెల్ ఫోన్ క్రిందటి దీపావళి కి పంపాడండి. అవే మన దగ్గర కొంటే డబల్ ఖర్చు అవుతుందంట" చెప్పాడు శ్రీనివాస్.

"అయితే మీకు చైనా వస్తువులు బాగా నచ్చాయన్నమాట." అడిగారు సుబ్బారావు గారు. "సరే. క్రిందటి దీపావళి కి మీకు గిఫ్ట్ గా వచ్చిన మీ దగ్గర ఉన్న చైనా వస్తువులలో ఎన్ని ఇంకా పని చేస్తున్నాయో చెప్పండి " క్లాసు ను ఉద్దేశించి అడిగారు సుబ్బారావు గారు.

"నా వాచ్ రెండు మూడు నెలలకే పాడై పోయిందండి. దానికి ఇక్కడ రిపేర్ చేసే అవకాశం లేదని తెలిసింది. ప్రస్తుతం దాన్ని గుర్తుగా పెట్టెలో దాచుకున్నాను. చైనా సెల్ ఫోన్ ఛార్జ్ చేస్తుంటే కాలి పోయింది సార్ " విచారంగా చెప్పాడు శ్రీనివాస్.

"ఇప్పుడు కరెక్ట్ విషయానికి వచ్చారు. చైనా వస్తువులు చాలా వరకు మన దేశంలో తయారు అయ్యే వస్తువుల కంటే చాలా చవకగా దొరుకుతాయి. ఇది కొంత వరకు నిజమే! దీనికి కారణం చైనా లో ఉన్న ఫ్యాక్టరీలు భారీగా వస్తువులను తయారు చేసి ప్రపంచం నలు మూలలా అమ్ముకుంటాయి. వాటి నాణ్యత కూడా అంతంత మాత్రమే. చైనా వాచీలు, సెల్ ఫోన్లు, బొమ్మలు, ఇతర ఎలక్ట్రిక్ వస్తువులు చౌకగా దొరికినా వాటి కి ఏవైనా విడి భాగాలు అవసరం అయినా, రిపేర్ వచ్చినా మన దగ్గర దొరికే పరిస్థితి

లేదు. అందువల్ల అవి పాడైపోతే పారేయటం తప్ప చెయ్యగలిగేది లేదు. పైగా వాటికి ఎటువంటి గ్యారంటీ కూడా ఉండదు. ఇక చైనా టపాకాయల గురించి -- వాళ్ళు తయారు చేసే టపాకాయలలో అధిక మొత్తం లో గంధకం (Sulphur) ఉంటుంది. మన దేశం లో తయారు అయ్యే టపాకాయలలో ఉండే Nitrate కన్నా గంధకం ఎంతో హానికారకం. వీటిని కాల్చటం వలన మన పర్యావరణం ఎంతగానో దెబ్బతింటుంది. అంతేగాదు ఆ విష వాయువులను పీల్చిన మన ఆరోగ్యం సైతం దెబ్బ తింటుంది. కేవలం ధర గురించి మాత్రమే ఆలోచించటం వలన చాలా మంది అనాలోచితంగా తక్కువ ధరకు లభించే చైనా వారు తయారు చేసే హాని కారకమైన టపాకాయలను కొనుగోలు చేసి తమ ఆరోగ్యానికే కాకుండా పర్యావరణానికి కూడా తీరని హాని కలిగిస్తున్నారు. అందువల్లనే చైనా టపాకాయల అమ్మకాన్ని, వాడకాన్ని చాలా చోట్ల నిషేధించారు. అలాగే చైనా బొమ్మల వలన మన కుటీర పరిశ్రమలు, నిర్మల్ బొమ్మలు, కొండపల్లి బొమ్మల వంటి కళా రూపాలు దాదాపుగా అంతరించి పోతున్నాయి. హస్త కళలకు ఎంతో పేరు పొందిన మన కళా కారులు సరి అయిన ఉపాధి లేక వేరే వృత్తులు చూసుకుంటున్నారు. ఒకప్పుడు అగ్గి పెట్టె లో మడిచి పెట్టగలిగే చీరలను తయారు చేసిన మన నేత కళాకారులు నేడు ప్రోత్సాహం కరవై, జీవనోపాధి కొరవై ఆ కళా నైపుణ్యాన్ని విడిచి పెట్టి వేరే వృత్తులు వ్యాపారాలు చేసుకుంటున్నారు. క్రమేణా మన చేతి వృత్తులు పూర్తిగా అంతరించే ప్రమాదం ఉన్నది. దీపావళి కి మనం మట్టి తో చేసిన ప్రమిదలలో నూనె పోసి వత్తులు వేసి వెలిగించి ధన లక్ష్మి కి స్వాగతం పలుకుతాం. కాని చైనా నుండి దిగుమతి అయిన కృత్రిమమైన రంగు రంగుల బ్యాటరీ దీపాలు, కరెంట్ దీపాల తోరణాలు ఇళ్ళ ముందు పెట్టుకొని అదేదో గొప్ప అన్నట్లు మురిసి పోతున్నాము. మన ఊరి లో ఉండే కుమ్మరులు తయారు చేసే మట్టి ప్రమిదలు వెలిగించితే దీపావళి కి సహజమైన, నిజమైన కళ వస్తుంది. మన ఊళ్లలో లభించే మట్టి ప్రమిదలు తెచ్చి వాటికి పోస్టర్ కలర్స్ ఉపయోగించి రంగులు వేసి చూడండి. ఎంతో అందంగా మంచి కళా రూపాలుగా కనిపిస్తాయి. మన భారతీయులు ఎందులోనూ ఎవరికీ తీసిపోరు. సాఫ్ట్ వేర్ రంగంలో ప్రపంచంలోనే మన వాళ్లకు తిరుగులేదు. అయినా వస్తువుల ఉత్పత్తి విషయం వచ్చే సరికి చైనా నుండి మన దేశంలోకి కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్న నాసి రకం, చౌక రకం వస్తువుల ధాటికి మన నాణ్యమైన వస్తువులు దెబ్బ తింటున్నాయి. మన ప్రజలు కూడా కేవలం చౌకగా వస్తున్నాయనే ఒకే ఒక్క కారణం తో చైనా వస్తువులు కొంటున్నారు.

ఇవన్నీ కాకుండా మరో ముఖ్య విషయం. ఒకప్పుడు నెహ్రూ గారి హయాం లో చైనా మన మీద దురాక్రమణ చేసింది. మనతో స్నేహం నటిస్తూనే వెన్ను పోటు పొడిచింది. అయినా మనం గతాన్ని మరిచిపోయి చైనా తో స్నేహ హస్తాన్ని చాచాము. మరి ఇప్పుడు ఏమి జరుగుతోందో తెలుసా ? --- మన దేశం లోకి నాసిరకం వస్తువులు గుమ్మరించి తక్కువ ధరలకు అమ్ముకుని సంపాదించిన కోట్లాది రూపాయలను మన సరిహద్దుల్లో ఉన్న మన శత్రు దేశానికి సాయం చేయటానికి ఉపయోగిస్తూ మన వేలితో మన కంటినే పొడిచే ప్రయత్నం చేస్తున్నది చైనా దేశం. దీనికి విరుగుడుగా ముందు మనం చైనా లో తయారు అయ్యే వస్తువులను కొనటం మానేసి మన దేశం లో తయారయ్యే వస్తువులనే వాడాలి. ఆ విధంగా మన దేశము లో తయారయ్యే వస్తువులు మనమే కొని ప్రోత్సహించటం వలన మన దేశం లో ఉన్న కార్మికులకు చేతి నిండా పని దొరుకుతుంది. దేశం లో ఉత్పత్తి పెరిగి ప్రజల ఆర్ధిక స్తితిగతులు మెరుగు అవుతాయి. అందుకే మన ప్రధాని గారు "మేక్ ఇన్ ఇండియా" అనే నినాదాన్ని ఇచ్చారు. మనం కూడా మన దేశం లో తయారుఅయిన వస్తువులనే ఉపయోగించుదాం. మీరందరూ ఈ దీపావళి సందర్భంగా ప్రతిజ్ఞ చెయ్యండి --" మేము మన దేశం లో తయారయ్యే వస్తువులను మాత్రమే ప్రోత్సహిస్తాం. మన దేశ ఆర్ధిక పురోభివృద్ధికి పాటు పడుతాం " అని చెప్పారు సుబ్బారావు గారు. "ఓ అలాగే. ఈ దీపావళి నుండే మేము చైనా వస్తువులను కొనము, ఉపయోగించము" ఒక్క గొంతుతో చెప్పారు విద్యార్థులు.




"సరిహద్దుల్లో పాకిస్తాన్ బలగాలు విధ్వంసం సృష్టించాయి. జమ్మూ జిల్లాలో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి భారత దళాల శిబిరాలు, గ్రామాలపై విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడి బి.ఎస్. ఎఫ్. జవాను సహా ఓ బాలుడ్ని పొట్టన పెట్టుకున్నాయి. మరో పది మందిని గాయపర్చాయి".

దినపత్రికలోని వార్తను బయటికి చదివి వినిపించాడు అశోక్.

'అంత దారుణానికి తెగబడిందా పాక్ సైన్యం?" ఆసక్తిగా అడిగాడు సింహాచలం.

"అవును నాన్నా... మన దేశం మీద చెప్పలేనంత ద్వేషం పెంచుకుంది. అన్ని రంగాల్లో భారత్ ముందుకు దూసుకుపోతుంటే

ఓర్వలేకనే ఇవన్నీ చేస్తోంది. ఉగ్రవాదం ఆపెయ్యమని అమెరికాతో సహా అన్నిదేశాలూ మొత్తు కుంటున్నా చెవిటివాడి ముందు శంఖం ఊదినట్టే ఉంది పాకిస్తాన్" ఓపికగా వివరణ ఇచ్చాడు అశోక్.

"అప్పట్లో బ్రిటీషువాడు స్వాతంత్ర్యం ఇచ్చినట్టే ఇచ్చి దాయాదుల మధ్య కుంపటి రగిల్చి వెళ్ళిపోయాడు. ఆ కుంపటి ఇంకా మండుతూనే ఉంది. పాకిస్తాన్ కి బుద్ధి వస్తుందంటే నమ్మబుద్ధి కలగదురా" బాధగా అన్నాడు సింహాచలం.

"సర్జికల్ స్ట్రయికులు చేసినా బుద్ధి రాలేదు వాళ్లకి" వినిపించాల్సిన వార్త కోసం పేపర్ వెతుకుతూ చెప్పాడు అశోక్.

'తండ్రీ కొడుకుల డిస్కషన్ కి మరొక వార్త దొరికిందా? పొద్దున్న లేచేసరికి పేపర్ కనబడితే చాలు గంటల తరబడి చర్చల్లో మునిగిపోతారు. టీ త్రాగి మరొక వార్తలోకి వెళ్ళండి". ట్రే లో తీసుకువచ్చిన రెండు టీ కప్పుల్ని టీ పాయ్ మీద పెట్టి చెప్పింది ఆనంది.

నవ్వుతూ భార్య ఇచ్చిన కప్పు అందుకున్నాడు అశోక్. "మాట్లాడడానికి నీకయితే పనిమనిషి, పక్కింటి వనజ, పద్మ, మీ అమ్మ ఉన్నారు. నాన్నకి ఊసులు చెప్పడానికి నేను తప్ప ఎవరు ఉన్నారు?" తిరిగి నవ్వుతూ ప్రశ్నించాడు.

సింహాచలం వయసు ఇప్పుడు ఎనభై అయిదు ఏళ్ళు. ఒక్కడే కొడుకు అశోక్. అశోక్ పుట్టిన కొన్నేళ్ళకే అతడి అమ్మ చనిపోయినా మళ్ళీ పెళ్లి చేసుకోలేదు సింహాచలం. తాతయ్య, నాన్నమ్మల సాయంతో పెంచాడు. అవన్నీ తాత ద్వారా విన్నాడు అశోక్. అప్పటి నుండి నాన్న మీద ప్రేమ పెంచుకున్నాడు. యాభయి దాటిన వయసులో కూడా నాన్నకి కావాల్సిన సేవలు చేస్తూ సంబరపడతాడు అశోక్. చేసేది పెద్దఉద్యోగమయినా తండ్రి దగ్గర చిన్నపిల్లాడిలా మారిపోయి సేవలు చేస్తాడు. నవ్వించే విషయాలు చెబుతాడు. అన్నం తినేటప్పుడు క్రింద ఒలకబోసుకుంటే శాంతంగా శుభ్రం చేస్తాడు. ఆయనకి ఇష్టమయిన తెల్లటి పంచె, చొక్కా తొడిగి తల దువ్విన తరువాతే తన పనుల్లో దూరతాడు అశోక్.

మామయ్య మీద భర్తకి ఎంత ప్రేముందో తెలిసిన ఆనంది కూడా ఆయనలో స్వంత తండ్రిని చూసుకుంటుంది. పిల్లలిద్దరూ ఇంజినీరింగ్ లో పి.జి. చేస్తూ దూరంగా ఉండడంతో వాళ్ళ భారం కూడా తగ్గిన ఆనంది భర్తామామల సేవలో మునిగి తేలుతుంది.

"ఆ వార్తలేవో చదివే బదులు టి.వి. ఆన్ చేయొచ్చు కదా...." అంది ఆనంది అక్కడున్న పేపర్లోని ఒక జిల్లా పేజి తెరుస్తూ.

“నాన్నతో రోజూ ఉదయాన్నే గడిపితే సాయంత్రం తిరిగి వచ్చేవరకు ఆయనకు తృప్తిగా ఉంటుంది. ఈ వయసులో ఆయనకి కావాల్సింది మనతో గడిపిన మధురజ్ఞాపకాలు. ఆయనతో గడపడానికి నాకూ ఒక రీజన్ కావాలి. వార్తలు వినిపించడం, స్నానం చేయించడం, వేడి టీ సాసర్లో పోసి చల్లారాక త్రాగించడం .... ఇవన్నీ చిన్నప్పుడు నాకు ఆయన చేసినవే. తిరిగి అప్పు తీరుస్తున్నాను. అంతే!” తండ్రికోసం తెచ్చిన టీని సాసర్లో పోసి అందిస్తూ చెప్పాడు అశోక్.

‘కళ్ళు మసకగా కనిపిస్తున్నాయి అక్షరాలు చదవలేకపోతున్నాను’ అన్నాడొకసారి ఆ మధ్య సింహాచలం. అప్పటి నుండి తండ్రికి వార్తలు వినిపిస్తున్నాడు అశోక్. చెకప్ కి వెళ్దామని గుర్తుచేస్తూనే ఉన్నాడు కానీ సింహాచలమే వాయిదా వేస్తున్నాడు. ప్రేమతో కొడుకు చేసే సేవల్ని వదులుకోవడం ఏ తండ్రికి ఇష్టం? సింహాచలం అందుకు అతీతుడు కాదు.

“మీ ఇద్దరిదీ అపురూప బంధం. లోకంలో ఉన్న కొడుకులందరూ మీలా ఆలోచిస్తే వృద్ధాశ్రమాలే ఉండవు” పేపర్లో వచ్చిన ఒక వృద్ధాశ్రమం వార్త చదివి అశోక్ తో అంది ఆనంది.

“ఏమిటమ్మా వృద్ధాశ్రమం అంటున్నావు? మీ ఇంట్లో అలాంటి పదం వినబడడమా?”.

మాటలు వినబడిన వైపు తలెత్తి చూసేసరికి చొరవగా లోపలకి అడుగు పెడుతున్న శేఖర్ కనిపించాడు.

‘రారా శేఖర్ ..” ఆత్మీయంగా ఆహ్వానించాడు అశోక్. శేఖర్, అశోక్ కాలేజి రోజుల నుండి స్నేహితులు. సింహాచలాన్ని అశోక్ లాగానే నాన్న అని పిలిచేంత ఇష్టమైన స్నేహితుడు శేఖర్.

“నాన్నకి వార్తలు వినిపిస్తుండగా నా మీద చలోక్తులు విసరడం మీ చెల్లికి అలవాటే కదరా! దగ్గరగా పోలిన వార్త ఇప్పుడే చదివి ఉంటుంది. అంతే!” చెప్పాడు అశోక్.

“అన్నయ్యా... మీకు టీ తెస్తాను” నవ్వుతూ లోపలకి వెళ్ళబోయింది ఆనంది.

“వాకింగ్ నుండి ఇంటికి వెళుతూ ఇలా వచ్చాను. షుగర్ లెస్ టీ అయితేనే ఇవ్వు” చెప్పాడు శేఖర్.

‘నాకు గుర్తుంది అన్నయ్యా” వెళ్తూ చెప్పింది ఆనంది.

“నాన్నా బాగున్నారా?” అని సింహాచలంని కూడా పలకరించాడు శేఖర్. బాగున్నట్టు తలాడించాడు సింహాచలం.

“దీపావళి టపాసుల సంగతి ఏం చేసావు? మా స్టాఫంతా ఎవరికో ఆర్డర్ ఇచ్చారు. పోయినేడాదిలాగే నువ్వు తెప్పిస్తావని ఆగాను. గుర్తుందా?” గుర్తుచేసాడు శేఖర్.

“ఇంకా ఏమీ అనుకోలేదు ..” కాసేపు ఆగి చెప్పాడు అశోక్.

“ఇంకా అనుకోలేదా? పండుగ దగ్గరకి వచ్చేసింది. కొంప ముంచావు కదరా... మా వాడయితే ఫోన్లో లిస్టు చదివేశాడు. లక్ష్మీబాంబులు, రాకెట్లు, చిచ్చుబుడ్లు, ఫైవు థౌజండ్ వాలా ....అంటున్నాడు. పోయినసారి కంటే ఘనంగా చెయ్యాలన్నాడు. ఇప్పుడెలా?” తలగోక్కుంటూ అన్నాడు శేఖర్.

“ఏదో తప్పు జరిగిపోయినట్టు ఎందుకురా అంతగా భయపడతావు?” నవ్వుతూ అడిగాడు అశోక్.

“మావాడు ఫైనల్ ఇయర్ కదరా.. స్టూడెంట్ లైఫుకి ఫులుస్టాపు పడినట్టేనని, సరదాలన్నీ ఇప్పుడే తీర్చుకోవాలని అన్నాడు. పైగా క్యాంపస్ సెలక్షన్ వచ్చిన హుషారులో ఉన్నాడు. వాడి గురించేరా నా ఆలోచన” నిజం చెప్పాడు శేఖర్.

“మా పిల్లలు కూడా ఆ మాటే అన్నారు ...” టీ కప్పు తో వచ్చిన ఆనంది చెప్పింది.

“థాంక్స్ చెల్లెమ్మా... ఆప్యాయంగా పలకరిస్తావు. రాగానే వేడిగా టీ ఇస్తావు” మెచ్చుకున్నాడు శేఖర్.

‘అదేంటన్నయ్యా.....టీ కి కూడా థేంక్స్ చెబుతావు” కోపంగా అంది ఆనంది.

‘మనం పొందిన సహాయానికి కృతజ్ఞత చెప్పడం కనీస ధర్మం అని ఎక్కడో చదివాను” టీ త్రాగుతూ చెప్పాడు శేఖర్.

“ఏ వాట్స్ ఆప్ మెసేజిలోనో చదివుంటావ్” టక్కున అందుకున్నాడు అశోక్.

‘నిజమే .. రోజూ వేల సంఖ్యలో మెసేజిలు వస్తున్నాయి. సరిగ్గా గుర్తు పెట్టుకోలేకపోతున్నాం” ఒప్పుకున్నాడు శేఖర్.

“ఈ సంవత్సరం దీపావళి టపాసులు కొనకూడదని మావారి ఉద్దేశం” దారి తప్పిన టాపిక్కును గుర్తుచేసింది ఆనంది.

“ఎందుకురా అలా అనుకున్నావ్?” ఆసక్తిగా అడిగాడు శేఖర్.

“ఇటీవల జరిగిన పాక్ దాడులూ, మన వాళ్ళు చేసిన సర్జికల్ స్ట్రయికులూ గుర్తున్నాయి కదా. సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం కనిపిస్తోంది. అక్కడ మన సైనికులు ప్రాణత్యాగం చేస్తుంటే మనం టపాసులు కాల్చి పండుగ చేసుకుంటామా?” ఆవేశంగా అడిగాడు అశోక్.

“మరైతే ఏం చేద్దామంటావు?” కాస్త ఆసక్తి మిళితమైన స్వరంతో అడిగాడు శేఖర్.

“దీపావళి జరుపుకోవడం మానేద్దామంటారా?” మరోప్రక్క ఆనందికీ ఆసక్తిగానే ఉంది.

“మానేద్దామని కాదు. కొత్తగా చెయ్యాలని ఆలోచన” చెప్పాడు అశోక్.

“అదేమిటో క్లారిటీ ఇస్తే మేమూ పాటిస్తాము” అన్నాడు శేఖర్.

"టపాసుల కోసం ఖర్చు చెయ్యడం వల్ల ఏం ప్రయోజనం ఉంది? గంట గంటన్నర వినోదం కోసం ఒక్కో కుటుంబం వేలకివేలు ఖర్చు చేస్తున్నారు. ధ్వనికాలుష్యం, వాతావరణ కాలుష్యం పెంచుతున్నారు తప్ప ప్రకృతికీ, పర్యావరణానికీ నష్టమే చేస్తున్నారు. అవునా?" అడిగాడు అశోక్.

"అవును..." ఒప్పుకుంది ఆనంది. తలాడించాడు శేఖర్.

"మనం కాల్చే టపాసుల్లో ఎక్కువభాగం చైనా నుండి దిగుమతి అవుతున్నాయి. మన సరిహద్దుల్లో కవ్వింపులకు పాల్పడుతున్న పాకిస్తాన్ కు చైనా వత్తాసు పలుకుతోంది. అన్ని రకాలుగా అండగా నిలుస్తోంది. చైనా మనలను పరోక్షంగా బెదిరిస్తుంది. తనకున్న వీటో పవర్ ను ఉపయోగించుకుని అంతర్జాతీయ కరుడుగట్టిన ఉగ్రవాది పాకిస్థాన్ జైషే మహమ్మద్ నేత "హాఫీజ్ మహమ్మద్" ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా గుర్తించేందుకు ఐక్యరాజ్యసమితి - సెక్యూరిటీ కౌన్సిల్ లో అడ్డుపడింది. ముంబై ఉగ్రవాద దాడికి ఆజ్యం పోసిన వ్యక్తిని కాపాడటం చైనా దుర్మార్గానికి పరాకాష్ట. అలాగే "అణు సరఫరా దేశాల కూటమి" లోకి భారత్ ను రాకుండా చైనా వ్యతిరేకిస్తోంది. అంతర్జాతీయంగా ఎన్నో విషయాల్లో మన పతనం కోరుతోంది చైనా. అలాంటి చైనాకు మన ద్వారా ఒక్క పైసా లాభమొచ్చినా, అది ఆయుధాలు నిర్మించి మనపైనే వాడే ప్రమాదముంది. అందుకే చైనా వస్తువుల వాడకం మానెయ్యాలి. చైనా వస్తువులు కొనడమంటే మన డబ్బుతో శత్రుదేశాన్ని పెంచి పోషిస్తున్నట్టా కాదా?" వెంటనే మరో ప్రశ్న అడిగాడు అశోక్.

"అవును ... అదీ నిజమే.." కాసేపు ఆలోచించి చెప్పాడు శేఖర్

"అందుకే ... టపాసులు కాల్చడానికి బదులు వేరే ఏదైనా చేద్దాం" చెప్పాడు అశోక్.

"నీ ఆలోచన బాగుంది రా ... ఏం చేద్దామో అదీ నువ్వే చెప్పు!" ప్రోత్సాహం అందించాడు శేఖర్.

"చాలా మంది సైనికులు ఇటీవల మన రక్షణ కోసం ప్రాణాలు వదిలారు. వాళ్ళ కుటుంబాలు దుఃఖంలో ఉండగా మనం సంతోషంగా పండుగ చేసుకుంటామా? మన ప్రధాని మోదీ గారు పిలుపు ఇచ్చినట్టుగా ఒక్కో కుటుంబం ఒక్కో దీపం వెలిగించి దేశరక్షణ కోసం అంకితమైన జవాన్లని స్మరించుకుందాం. నూతనోత్తేజం, పండుగ సందేశం జవాన్లకు అందేలా ప్రతి ఒక్కరం మన సందేశం పంపిద్దాం. పండుగ రోజుల్లో కూడా కుటుంబానికి దూరంగా గడుపుతున్న సైనికుల శ్రేయస్సు కోరి ప్రార్థనలు జరుపుదాం. అంతే కాకుండా మనం టపాసులు కొనకుండా మిగిలించిన డబ్బుని సైనిక సంక్షేమ నిధికి జమ చేద్దాం"

ఉద్వేగంగా చెప్పాడు  అశోక్.

"చాలా బాగుంది రా నీ ఆలోచన. ఒక్కో దీపం వెలిగిస్తే సరిపోతుందా?" అడిగాడు శేఖర్.

"సైనికుల సంస్మరణ కోసం ఒక్కో దీపం ముందుగా వెలిగిద్దాం. ఆ తరువాత ఎప్పటిలాగే మన కోసం పండుగ వాతావరణం సృష్టించుకుందాం. ప్రమిదలలో వెలిగించిన దీపాల తోరణాలతో మన సాంప్రదాయం గుర్తొచ్చేలా పండుగ చేసుకుందాం" చెప్పాడు అశోక్.

"శభాష్ రా... మంచి ఆలోచన.  నీకు అభినందనలు"  నిజాయితీగా చెప్పాడు అశోక్.

"బాగుందండీ మీ ఆలోచన" వెంటనే చెప్పింది ఆనంది.

"ఇది నా ఆలోచన కాదు. ప్రధాని మోదీ గారు చెప్పిన తరువాత వచ్చిన ఆలోచన" సర్ది చెప్పాడు అశోక్.

"ఇది బాగుంది కాబట్టి మన పిల్లలకు నచ్చజెపుదాం. మరీ చిన్నవాళ్ళు కాదు కాబట్టి అర్థం చేసుకుంటారు" అన్నాడు అశోక్.

"ఇప్పటికే వాట్స్ ఆప్ లో, ఫేస్ బుక్ లో  ఎన్నో మెసేజీలు వచ్చి ఉంటాయి" అన్నాడు శేఖర్.

"మన రెండు కుటుంబాలు మాత్రమే ఈ ఆలోచన పాటిస్తే సరిపోదు. మన వీధిలో, ఆఫీసులో ప్రచారం చేయాలి.  మంచి సందేశంతో కూడిన మెసేజీలు  తయారుచేసి వాట్స్ ఆప్ లో, ఫేస్ బుక్ లో  పెట్టాలి. మెయిల్స్ ఇవ్వాలి. లోకల్ న్యూస్ లో వచ్చేలా కరపత్రాలు పంచి పెద్ద ఎత్తున ప్రచారం చేయాలి.  ప్రకృతిని కాపాడాలి. మన సైనికులకు మన ప్రేమాభిమానాలు పంచి పెట్టాలి. వారిలో ఆత్మస్థైర్యం పెంచాలి"  వరుసగా చెప్పాడు అశోక్.

"అవన్నీ చేయడానికి నేను రడీ. మెసేజీలు వ్రాయడానికి నాకో ఫ్రెండ్ ఉన్నాడు. మిగతా ఏర్పాట్లు కోసం మనం ఒక మీటింగ్ పెట్టుకొని కలిసి చేద్దాం" మాట ఇచ్చాడు శేఖర్.

“బాగుందర్రా  మీ ఆలోచన. మనవాళ్ళలో దేశభక్తి తగ్గిందేమో అని అనుమానం కలిగింది.  నా ఆలోచన తప్పని నిరూపించారు మీరు.  చాలా సంతోషంగా ఉంది” అన్నాడు సింహాచలం.

“ఈ దీపావళి సైనికులకు మనమిచ్చే నివాళి” ఒక్కసారి అన్నారు శేఖర్, అశోక్, ఆనంది.




సుబాష్ చంద్రబోస్ అంటే జల్సాపురుషుడు. కీర్తి, కాంత, కనకాల్లో..కనకం వాళ్ల నాన్న బాగా సంపాదించి పెట్టాడు. కీర్తి అతని సబ్జెక్ట్ కాదు. ఇహ కాంతం అంటే అతని ప్రాణం. కాంతం అంటే ఓ వేశ్య. సరదాగా ఒకసారి వెళ్లాడు. పిచ్చ పిచ్చగా నచ్చేసింది. అంతే..ఊరివాళ్లు చెవులుకొరుక్కున్నా, ముఖంమీదే మాటలన్నా దున్నపోతు మీద వాన కురిసినట్టుగా, అచ్చోసిన ఆబోతులా తిరుగుతుంటాడు. వాళ్ల నాన్న మిలట్రీలో పనిచేసి వచ్చాడు. తాత స్వాతంత్ర్య సమరయోధుడు అలాంటి ఇంట్లో తప్పపుట్టాడని తండ్రి ఎప్పుడూ తిడుతూనే ఉంటాడు. అయినా మనోడు సిగ్గూ, లజ్జా, మానం, అభిమానం వదిలేశాడు కాబట్టి నవ్వుతూ బలాదూర్ గా తిరుగుతుంటాడు.

ఒకసారి మాంచి ఆకలిమీదున్నాడు. అలాంటి ఆకలి వేసినప్పుడు కాంతమే మృష్టాన్నం. అందుకే యమహా బైకుమీద

యమస్పీడుగా కాంతం ఇంటి వైపుగా వెళ్ళిపోతున్నాడు.

ఆమె ఇంటికి వెళ్లేదారిలో కనకరాజు మేడుంది. దాని పక్కనే రాజిగాడిల్లు. రాజిగాడంటే సుబాష్ ఫ్రెండ్. చిన్నప్పటినుంచి కలిసి పెరిగారు. ఎందుకో కాని రాజిగాడంటే సుబాస్ కి ప్రాణం. రాజిగాడు మిలట్రీలో జాయినయ్యాడు. వాడు వెళ్లబోతుంటే కన్నీరుమున్నీరయ్యాడు సుబాష్. 'ఒరే రాజి, నువ్వు మిలటరీలోకి ఎళ్లడమేంట్రా? యుద్ధాలవి వచ్చి..నిన్నక్కడికి పంపిస్తే..నీకేవన్నా అయితే నేను తట్టుకోలేన్రా..నా మాటిని ఇక్కడే ఉండిపోరా! మాకు బోలెడంతుంది. నిన్నూ మీ అమ్మని సొంతోళ్లలా నేను చూసుకుంటాను' అని కాళ్లావేళ్లా పడ్డాడు. రాజిగాడు మాత్రం'ఒరే! నాకెందుకో మిలట్రీలో చెయ్యాలని ఇష్టంరా. ఎంచక్కా మన దేశానికి కాపలా కాస్తూ, మనవంక కన్నెత్తి చూసే శతృనాయాళ్లని పిట్టల్ని కాల్చేసినట్టు కాల్చేస్తాను.

మీ తాత, అయ్యా      గొప్ప దేశభక్తుల్రా..నువ్వూ అట్టుంటే ఎంత బాగుండేది? సర్లే..నీ ఇష్టం నీది' అని మూడేళ్ల క్రితం వెళ్లిపోయాడు. రాజిగాడిని చూడాలని మనసు ఎంత పీకుతున్నా ఏం చేయగలడు? ఎప్పుడొస్తాడో అని ఎదురు చూడ్డం తప్ప.

రాజిగాడింటి ముందు కొంతమంది జనం కనిపించారు. వాడి కళ్లకు కాంతం అంగాంగాలు కన్పిస్తూ కవ్విస్తున్నాయి. మరేం కనిపించడం లేదు. సరాసరి కాంతం ఇంట్లోకెళ్లి ఊయల బల్లమీద కూర్చున్న కాంతాన్ని అమాంతం ఎత్తుకుని పడగ్గదిలోకి తీసుకెళ్లాడు. ఆమె ఏదో మాట్లాడబోయింది. మాట్లాడనిస్తేగా..తుఫానులా చుట్టేశాడు. మట్టిముద్దని నలిపేసినట్టు నలిపేశాడు. పూరేకల్ని ఒలిచేసినట్టు బట్టల్ని తొలగించేసి ఆమెలోకి ప్రవేశించేశాడు. అల ఓ రెండు మూడు సార్లు సంభోగానందం పొంది..తృప్తిగా సేదదీరుతూ.. అప్పుడడిగాడు

"కాంతం..రాజిగాడింటి ముందు ఏమిటే ఆ జనం" అని.

రాజిగాడు..మన పక్క దేశం సరిహద్దుకాడ కాపలా కాస్తుంటే..ఆ దొంగెదవలొచ్చి కాల్చేశారంట..ఇప్పుడో ఇంకాసేపట్లోనో శవం వస్తుందట.."అంది. దానికి తెలుసు సుబాస్ కి రాజిగాడంటే ఎంత ప్రేమో.

"ఇప్పుడా చెప్పేది"సర్రున లేచి బట్టలు కట్టుకుంటూ అన్నాడు.

"నేను చెప్పబోతుంటే..నువ్వు ఎద్దుమాదిరి కుమ్మేస్తుండావాయే.."అని ఏదో చెబుతూనే ఉంది, సుబాష్ వేగంగా పెద్ద పెద్ద అంగలతో బయటకి వెళ్లిపోయాడు.

రాజిగాడి తల్లి శోకదేవతలా ఉంది. సుబాష్ ని చూసి"ఒరే! రాజిగాడు మనకు లేడురా"అని పెద్దపెట్టున ఏడ్చింది. సుబాష్ కళ్లలో అవిశ్రాంతంగా కన్నీళ్లు. "ఊర్కో అమ్మా..ఊర్కో.." అని ఆవిడ్ని ఊరడించే ప్రయత్నం చేస్తున్నాడు. అప్పుడే మిలటరి ట్రక్ లో రాజిగాడి శవం వచ్చింది. సుబాష్ ఆ పెట్టెమీద బోరున విలపిస్తూ పడిపోయాడు.తన స్నేహితుడు..తన ప్రాణం అలా అచేతనంగా ఉండే సరికి గుండె మండిపోయింది.

సైనిక లాంఛనాలతో రాజిగాడి దహనం అయ్యాక సుబాస్ పూర్తిగా మారిపోయాడు. ఊరి నడిబొడ్డు మీద కూడలిలో మిత్రుడి శిలాప్రతిమ పెట్టించాడు.

ఒకసారి అక్కడ అందర్నీ సమావేశ పరచి"నా స్నేహితుడు మరణించాడన్న విషయం మీకు తెలుసు. దేశాల మధ్య యుద్ధాలొచ్చి ఒక నీతితో యుద్ధం చేస్తే, అందులో అసువులు బాస్తే అది వీరమరణం. కానీ నా స్నేహితుడు శత్రుదేశ కుహనా బుద్ధితో సరిహద్దు వెంబడి కాల్పులు చేస్తే నా స్నేహితుడు మరణించాడు. ఆ దేశం ఎప్పుడూ అంతే పిరికిది. కాల్పుల విరమణకు తూట్లు పొడుస్తూ, పదే పదే కవ్వింపు చర్యలకు పాల్పడుతుంటుంది. ఉరి, పఠాన్ కోట్ సంఘటనలకు కారకమవుతుంది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ దేశాల్లో కళంక దేశంగా నిలిచింది. అదే నాకు చాలా బాధగా ఉంది. కడుపు తరుక్కుపోతోంది. అందరికీ నా అనే అన్నదమ్ములుంటారు. కాని సైనికుడు మాత్రం అందరికీ సోదరుడే! రాజిగాడు మన ఊరివాడు. మనవాడు. దేశమంటే వాడికి ఎంతిష్టమో మీకు తెలుసు. వాడు కన్ను మూయడం మనందరికీ లోటే! నేనో నిర్ణయానికి వచ్చాను. ఇహనుంచి పాకిస్తాన్ అన్న పదం మనం వినకూడదు. అది దొంగ దేశం. మనం స్వతహాగా శాంతికాముకులం కాబట్టి, యుద్ధాల వల్ల నష్టపోతాం కాబట్టి ఇన్నాళ్లూ హితోపదేశం చేశాం. మన మంచితనాన్ని ఆ ఉగ్రదేశం చేతకాని తనం అనుకుంటోంది. ఇప్పుడు మోడీగారు పాకిస్తాన్ కు గట్టి హెచ్చరికలు చేస్తున్నాడు. ఈ విషయంలో దేశాల మద్దతు కూడగట్టుకుని ముందుకెళుతున్నారు. మన ఈ స్వాతంత్ర్యం మా తాతయ్య, నాన్నల లాంటి ఎంతోమంది త్యాగ ఫలితం. దాన్ని మనం కాపాడుకోవాలి. గ్రీన్ డ్రస్ వేసుకుని, మిలటరీలో ఉంటేనే దేశానికి సైనికులం కాదు. మనమూ సైనికులమే. పాపం మంచులో, ఎడారిలో మన రక్షణ కోసం రాత్రింబగళ్లు తమ వాళ్లకు దూరంగా దేశ రక్షణలో నిమగ్నమయ్యే మన సైనికుల కోసం మనం కొన్ని నిర్ణయాలు తీసుకోవాలి. మానవతా దృక్పథంతో వాళ్లకు మనమున్నామన్న భావన కలగజేయాలి.

1. మనసైనికులకు సంఘీభావంగా పండగలకి, ప్రత్యేక దినాలకీ గ్రీటింగ్స్ పంపించాలి

2. పాకిస్తాన్ మన మీద దాడి చేసిన ప్రతిసారీ మనవాళ్లను అభినందిస్తూ, మనోస్థైర్యాన్ని పెంచుతూ ఉత్తరాలు రాయాలి. . టి వి ల్లో, పేపర్లలో ప్రకటనలు ఇవ్వాలి

3. అవి చూసి సైనికుల తల్లిదండ్రులు అలాంటి వీర పుత్రులను కన్నందుకు మురిసిపోవాలి. వీలు చూసుకుని మనం వాళ్లను కలవాలి

4. మోడీగారికి పాకిస్తాన్ కుయుక్తులను తుత్తునియలు చేయమని సామూహిక విజ్ఞాపనలు చేయాలి

5. మన సైనికులకు మనం బయట నుంచి ఏ సహాయం కావాలన్నా చేస్తామని తెలియచేద్దాం.

6. పాకిస్తాన్ కు సహాయం చేస్తూ, మనకు పక్కలో బల్లెమైన చైనా తయారు చేసిన దీపావళి టపాసులు కొనకూడదు. ఒక్క టపాసులే కాదు ఆ దేశం ఉత్పత్తిచేసే ఏ వస్తువునూ, ఎంత చవగ్గా ఉన్నా కొనకూడదు. అసలు మనదేశం లోకి రానీయకుండా కేంద్రం చర్యలు తీసుకునేలా చూడాలి.

7. పాకిస్తాన్ పేర్లకి సంబంధించిన బేకరీల్లో, షాపుల్లో ఏవీ కొనకూడదు.

8. రెండు రోజుల్లో రాబోయే దీపావళిని మన రాజిగాడికి అంకితమిద్దాం. మన టపాసులతో ఆకాశంలో వెలుగులు నింపుదాం. టప టపలు ఢమ ఢమలతో పాకిస్తాన్ కు ఖబడ్దార్ అని హెచ్చరికలు చేద్దాం.

9. అమరులైన వీర సైనికుల తల్లిదండ్రులను కలసి అలాంటి పిల్లల్ని కన్నందుకు అభినందించి, సన్మానించాలి. అవసరమైతే ఆర్థిక సాయం చేయాలి.

మీరేమంటారు? అన్నాడు.

అందరూ మిన్నంటేలా చప్పట్లు చరిచారు.

తమ పిల్లాడిలో వచ్చిన మార్పుకు సుబాష్ తండ్రి, తాతయ్యల కళ్లలో నీళ్లు నిలిచాయి.

*****

ఈసారి ఆ ఊళ్లో దీపావళి అదిరింది. సరిహద్దు రేఖ వెంబడి మన సైనికులు ఎలా శత్రుదేశ కాల్పులకు ఎదురుకాల్పులతో సమాధానం చెబుతారో అలా కాల్చారు. రాజిగాడి స్మృతిలో జరిగిన బాణాసంచా వేడుక మిగతా ఊళ్లవారికీ, రాష్ట్రాలకి స్ఫూర్తినిచ్చింది. ఇప్పుడు మనదేశమంతా ఏకమై సైనికబలంగా రూపొందింది. నేడో రేపో పాకిస్తాన్, చైనాలు మన బలం ముందు తోక ముడవడం ఖాయం. అందుకే ఆ దీపావళి..సైనికుల కోసం జరిపిన దీపావళిగా చరిత్రలో నిలిచిపోయింది.